



- ఓట్ల కొనుగోళ్లు ప్రారంభం
- నగదు పంపకాల్లో పార్టీల నాయకులు
- ఎక్కడికక్కడ ప్రత్యేక బృందాలతో పంపిణీ
- ప్రాంతాలను బట్టి రూ.1,500 నుంచి రూ.3 వేలు

ఓటుకు.. నోటు

ఓటు.. నోటు.. వల.. ఇదీ ఎన్నికల పంథాగా మారింది. ప్రచారాల్లో నిమగ్నమైన నేతలు పోలింగ్ సమీపిస్తోన్న దశలో నోట్ల పంపకానికి సిద్ధమయ్యారు. ప్రచారాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇప్పటి వరకు ప్రయత్నించిన ప్రధాన రాజకీయ పార్టీలు నగదు పంపకానికి తెరలేపాయి. ప్రచారానికి తెర పడక ముందే ప్రలోభాల పర్వానికి రాజకీయ పార్టీలు తెర లేపాయి. ప్రతీ ఓటరు కు డబ్బు చేరేలా పకడ్బందీగా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నారు. వీడియో, స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు గస్తీ తిరుగుతున్నా వాటి కళ్లు గప్పి నగదు పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గాన్ని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారు. ఇందు కోసం అభ్యర్థులు ప్రత్యేక బృందాలను నియమించుకుని పర్యవేక్షిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో గురువారం నుంచే నగదు పంపిణీ చేపట్టగా శుక్రవారానికి తారస్థాయికి చేరింది. ఓట్ల కొనుగోలుకు సాంకేతికతను కూడా కొందరు అభ్యర్థులు వినియోగిస్తున్నారు.

నియోజక వర్గానికి రూ.40 కోట్లు

బాపట్ల జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి కనీసం రూ.40 కోట్లు పంచేలా ప్రణాళికలు రచించారు. ఈ మొత్తం రూ.60 కోట్ల వరకు వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బాపట్లలో అధికారపార్టీ అభ్యర్థి తరఫున ఓటుకు రూ.1,500 పంచుతున్నట్లు సమాచారం. అద్దంకి, పర్చూరు లాంటి నియోజకవర్గాల్లో ఈ మొత్తం రూ.2,000గా ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యర్థి పార్టీ ఎంత డబ్బు పంచుతుందనే అంశంపై దృష్టి పెట్టి వారిచ్చిన దాని కంటే ఎక్కువ మొత్తం ప్రత్యర్థి ఇస్తున్నారని తెలిస్తే అప్పటికప్పుడే డబ్బు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. అద్దంకి, పర్చూరు, రేపల్లె లాంటి చోట్ల డబ్బు పంపిణీపై తాడేపల్లి పెద్దలు స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

పల్నాడులో రూ.450 కోట్లు ఖర్చు?

పల్నాడు జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఓట్ల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి నుంచి ఈ ప్రక్రియ ఊపందుకుంది. ఓట్ల కొనుగోలుకు జిల్లాలో రూ.450 కోట్ల వరకు ఖర్చు అవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని ఓ నియోజకవర్గంలో అత్యధికంగా ఓటు రేటు రూ.3 వేలు పలికింది. రెండు నియోజకవర్గాల్లో ఇరు పార్టీలు ఓటుకు రూ.1,500గా రేటు నిర్ణయించి పంపిణీ చేస్తున్నారు. అయితే పట్టణంలో రూ.1500 చెల్లిస్తుండగా మరో నియోజకవర్గంలో పట్టణ ప్రాంతంలో రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు ఆయా పార్టీల నేతలు తెలిపారు. మరో నియోజకవర్గంలో పట్టణ ఓటర్లకు ఇరుపార్టీలు రూ.2,500, గ్రామాల్లో రూ.2 వేలు అందజేస్తున్నట్లు సమాచారం. అరాచకాల అడ్డాగా ఉన్న నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి గ్రామాల్లో రూ.3 వేలుకు, పట్టణంలో ఇంకా ఎక్కువ రేటుకే ఓట్లు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రత్యర్థి మాత్రం గ్రామం, పట్టణం అన్న తేడా లేకుండా రూ.2 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఓ ప్రధాన నియోజకవర్గంలో ఇరు పార్టీలు రూ.2 వేలు చెల్లిస్తుండగా, ఓ అభ్యర్థి ఓటు కార్డు స్కాన్‌తో నగదు అందిస్తున్నట్లు తెలిసింది. ఒకే సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులు పోటీలో ఉన్న ఓనియోజకవర్గంలో ఓటుకు రూ.3వేలు చెల్లిస్తున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. మరో నియోజకవర్గంలో ఓటుకు ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు రెండేసి వేలు చెల్లిస్తున్నారు.

తక్కువగా గుంటూరు తూర్పులో రూ.వెయ్యి

పోలింగ్ తేదీ సమీపించడంతో గుంటూరు జిల్లాలోని ఓటర్లను ఆకట్టుకునేందుకు నగదు పంపిణీ గురువారం నుంచే ప్రారంభించారు. పొన్నూరు నియోజకవర్గంలో ఓటుకు రూ.2,500 చొప్పున పంచుతున్నారు. వైసీపీ నేతలు పట్టణంలో రూ.2,500, గ్రామాల్లో రూ.1,500ల నుంచి రూ.2వేల వరకు పంచుతున్నారు. ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో రూ.1,500 చొప్పున ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారు. గుంటూరు తూర్పులో ఓటరుకు రూ.వెయ్యి చొప్పున ఇరుపార్టీల తరుపున పంపకాలు మొదలయ్యాయి. పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం వైసీపీ రూ.2 వేలు పంపిణీ చేసినట్లు సమాచారం. తెనాలిలో రూ.1500 వరకు ఓటుకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

(గుంటూరు, నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత ఎన్నికల్లో ప్రచారం ముగిశాక డబ్బు పంపిణీ చేపట్టేవారు. అయితే ఈ సారి దీనిని మార్చి వేశారు. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగుస్తుంది. అప్పటికల్లా డబ్బు పంపిణీ పూర్తి చేసేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రచారం ముగిశాక తనిఖీలు జరగవచ్చన్న అంచనాతో ధనం పంపిణీలో నాయకులు జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో గురువారం నుంచే డబ్బు పంపిణీని ప్రారంభించారు. పలు నియోజకవర్గాల్లో శుక్రవారం నగదు పంపిణీ విస్తృతంగా జరిగింది. ఎన్నికల యంత్రాంగం తనిఖీలు నిర్వహించే లోపే డబ్బు పంపిణీ పూర్తి చేయాలనే ఆలోచనలో నేతలు ఉన్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కొక్క విధానంలో ఓటర్ల కొనుగోళ్లు జరుగుతున్నట్లు సమాచారం. నియోజక వర్గంలో 1.50 లక్షల నుంచి 2 లక్షల చొప్పున ఓటర్ల ను కొనుగోలు చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బును సిద్ధం చేసుకుని పంపిణీ చేస్తున్నారు. ఒక పార్టీ సానుభూతి పరుల ఓట్లను మరో పార్టీ కొనుగోలు చేయడంలేదు. ఈ మేరకు ఓటర్ల జాబితా ల్లో సదరు పేర్లను గుర్తించి కొనుగోళ్లు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఓటర్లకు స్లిప్పులు కూడా ప్రత్యేకంగా పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం కల్లా ఓట్ల కొనుగోలును పూర్తి చేసుకునేలా ప్రణాళికను రూపొందించుకున్నారు. డబ్బు పంపిణీ పూర్త చేసుకుంటేనే మరో వైపు పోలింగ్ వ్యూహాన్ని అభ్యర్థులు రూపొందించుకుంటున్నారు. ఎంత డబ్బు పంపిణీ చేసినా పోలింగ్ రోజున పై చేయి సాధించకపోతే ప్రతికూల ఫలితాన్ని చూడాల్సి వస్తుందన్న అభిప్రాయంతో అభ్యర్థులు డబ్బు పంపిణీని వీలైనంత త్వరగా ముగించేందుకు సిద్ధమయ్యారు. గురువారం నుంచి డబ్బులు పంపిణీ ప్రారంభమైనా పోలీసుల నుంచి మొక్కుబడి తనిఖీలు తప్పితే పంపిణీని కట్టడి చేయాలనే చిత్తశుద్ధి లేకుండా పోయింది. దీనికితోడు కొంతమంది పోలీసులు, అధికారులు పాలకపార్టీకి అండగా ఉండటంతో పంపిణీలో వైసీపీ అభ్యర్థులు దూసుకుపోతున్నారని సమాచారం.

మీ డబ్బు మాకొద్దు

ఈ దఫా మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టి కొనసాగించారు. సొంత నిధులు ఖర్చు చేసి పలువురికి ఆర్థికసాయం అందించారు. ఉపాధి అవకాశాలు కల్పించారు. దీంతో అక్కడ టీడీపీకి భారీ మెజార్టీ ఖాయమన్న ప్రచారం జరుగుతుంది. అయితే తొలుత లోకేశ్‌ను ఓడించాలని వైసీపీ శతవిధాలా ప్రయత్నాలు చేపట్టింది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించి లోకేశ్‌కు వచ్చే మెజార్టీని అయినా తగ్గించాలని ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో భారీగా డబ్బు పంపిణీ ద్వారా ఓటర్లకు గాలం వేస్తున్నది. ఒక్కో ఓటరుకు రూ.3 వేలు చొప్పున గడపగడపకు ఆ పార్టీ కార్యకర్తలు వెళ్లి గురువారం నుంచి పంచడం ప్రారంభించారు. అయితే చాలామంది ఓటర్లు మీ డబ్బు మాకు అవసరం లేదు.. మాకు లోకేశ్ ద్వారా ఎంతో మే లు జరిగిందని ముఖానే చెప్పి తలుపులు మూసేస్తున్నారు.

పదివేలు ఇస్తారట.. తీసుకుని సైకిల్‌కి ఓటేయండి

మంగళగిరిలో జగన్ డబ్బును ఏరులై పారిస్తున్నాడు. ఓట్ల కొనుగోలుకు రూ.300 కోట్లను కేటాయించారు. అదంతా పాపపు సొమ్మే! ఇసుక, మద్యం, గంజాయిలో అడ్డగోలుగా దోచుకున్న డబ్బది. ఓటుకు రూ.10 వేల చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఏం పర్వాలేదు.. ఓటర్లు నిరభ్యంతరంగా ఆ డబ్బును తీసుకోవచ్చు. అదంతా జనం నుంచి దోచుకున్న డబ్బే. ఐదేళ్లుగా ఒక్కో ఓటరు నుంచి జగన్ లక్ష రూపాయల వంతున దోచుకుని ఇపుడు ఆ సొమ్ములో పదో వంతును మళ్లీ మీకే ఇస్తున్నాడు. ఆ డబ్బును ఓటర్లు తీసుకుని ఓటుమాత్రం రాష్ట్ర భవిష్యత్తు కోసం శ్రమించే తమకే అంటే సైకిల్ గుర్తుపైనే వేయాలి.

- ఓటర్లకు నారా లోకేశ్ పిలుపు



మాచర్ల సభకు హాజరైన జనసందోహం

- జనసంద్రంలా ప్రజాగళం
- వర్షంతో సభకు రాలేకపోయిన చంద్రబాబు
- ఒంగోలు నుంచి ఆన్‌లైన్‌లో ప్రసంగించిన అధినేత

మాచర్ల.. మార్మోగింది

మాచర్ల టౌన్/నరసరావుపేట మే 10 (ఆంధ్రజ్యోతి): జనం.. జనం.. మాచర్ల జనసంద్రమైంది. ఎటుచూసినా జనమే.. ఇసుకేస్తే రాలనంతా జనం. జయజయధ్వానాలతో మాచర్ల మారుమోగింది. చంద్రబాబు ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా వివిధ ప్రాంతాల నుంచి గొడుగులు చేతబూని మధ్యాహ్నం మూడున్నర గంటలకే మాచర్లకి తరలివచ్చారు. మాచర్లలోని శ్రీశైలంరోడ్డులో శుక్రవారం ప్రజాగళం సభకు నేతలు ఊహించని స్థాయిలో జనం తరలి వచ్చారు. అయితే వర్షం కారణంగా సభకు హెలికాప్టర్‌లో చంద్రబాబు రాలేకపోయారు. దీంతో అభిమానులు కొంత నిరుత్సాహానికి లోనయ్యారు. ఇది గ్రహించిన చంద్రబాబు ఒంగోలు నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించి వారిలో జోష్ నింపారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ప్రత్యక్షంగా హాజరై ప్రసంగించిన దాని కన్నా గంబీరమైన ఉపన్యాసాన్ని వీడియోగ్రాఫ్ ద్వారా వినిపించారు. పౌరుషాల గడ్డ పల్నాడు ప్రజలందరికీ వందనం అంటూ ప్రసంగం మొదలుపెట్టారు. ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచకాలను ఎండగట్టారు. పిన్నెల్లిని విమర్శించిన సందర్భంలో సభికులు హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. ఐదేళ్ల జగన్ అరాచకంపై ఆవేదన, కసి ఉంది.. జగన్‌రెడ్డిని ఓడించాలనే ఆవేశం మీలో ఉంది.. ఆ ఆవేశం తిరుగుబాటుగా కనిపిస్తోందని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కుప్పంతో సమానంగా మాచర్లను చూసుకుంటానని హామీ ఇచ్చారు. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసి పల్నాడుకు నీరిస్తానని తెలిపారు. ఆ తర్వాత మాచర్ల టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తా.. బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలగడానికి ఎంతో సమయం లేదని తెలిపారు. నా ప్రాణం పోయే వరకు నియోజకవర్గాన్ని అంటిపెట్టుకుని ఉంటా. మాట ఇచ్చానంటే ఆరునూరైనా సమస్య పరిష్కరించడానికే కృషి చేస్తానన్నారు.



ప్రసంగిస్తున్న బ్రహ్మారెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మధుబాబు తదితరులు

మిస్టర్ పిన్నెల్లీ కథలు కట్టి పెట్టు : చంద్రబాబు

విధ్వంసకారుడు, దోపిడీదారుడు, సైకో ఏకమైతే జగన్‌రెడ్డి. పల్నాడులో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు. పంటలతో పల్నాడు పచ్చగా ఉండాలని నేను తపిస్తే.. జగన్‌రెడ్డి రక్తంతో తడిపేశాడు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్లలో చేసిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. పోలీసుల్ని అడ్డం పెట్టుకుని హత్యా రాజకీయాలకు, హింసకు తెరలేపాడు. టీడీపీ కార్యాలయాలు తగలబెట్టాడు. ఇళ్లపై దాడులు చేశాడు. రౌడీ రాజకీయాల్ని తుదముట్టిస్తా. మిస్టర్ పిన్నెల్లీ కథలు కట్టి పెట్టు. మాచర్లలో తిరుగుబాటు మొదలైంది. విప్లవంగా మారుతోంది. ప్రతి ఘటనకూ రిటర్న్ గిఫ్ట్ ఇస్తా. పల్నాడులో పసుపు జెండా నిలబెట్టడం కోసం త్యాగాలు చేసిన కార్యకర్తలను మరచిపోను. ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య, జల్లయ్య లాంటి కార్యకర్తలకు ఈ వేదికగా నివాళులర్పిస్తున్నా. పీకపై కత్తి పెట్టి జై జగన్ అంటే వదిలేస్తామన్నా ప్రాణాలొదిలిన చంద్రయ్య లాంటి వ్యక్తిని మరచిపోను. ఒక కార్యకర్త పార్టీని ఎంతగా ప్రేమిస్తాడో చంద్రయ్య ఓ ఉదాహరణ. పల్నాడులో 30 మంది కార్యకర్తల్ని వైసీపీ రౌడీలు పొట్టన పెట్టుకున్నా ఏ కార్యకర్తా వెనక్కి తగ్గలేదు.

మిమ్మల్ని నమ్ముకున్నా : బ్రహ్మారెడ్డి

మిమ్మల్ని నమ్ముకొని బరిలోకి వచ్చా.. రెండున్నరేళ్లుగా అధికారపార్టీకి వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు చేశా.. పేదలు కడగండ్లను తీరుస్తానని కంటతడితో చెప్పారు. మాచర్లలో పరిస్థితి చంబల్‌లోయలో కన్నా దారుణంగా ఉంది. పెద్దదొర, చిన్న దొరలకు ముగింపు పలకకపోతే మన జీవితాలు వృథా అవుతాయి. పిన్నెల్లి సోదరులు వేలకు వేలు డబ్బులు చెల్లించి ఓట్లను కొనుగోలు చేస్తున్నారు. జనం నోళ్లుగొట్టి వక్రమార్గంలో సంపాదించిన డబ్బులు ఎంతైనా ఖర్చు పెడతారు. ఓటే ఆయుధంగా భావించి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి. తప్పుడు కేసులు పెట్టారు. కార్లు కాల్చేశారు. బాధితులపైనే కేసులు పెట్టి కుటుంబాలకు దూరం చేసిన గుడుంబా సోదరులకు సోమవారం జరిగే ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెప్పి ఇంటికి పంపించాలి.

సూపర్ 6తో సక్సెస్ : శ్రీకృష్ణదేవరాయలు

సూపర్ 6 పథకాలతో మా విజయం పూర్తిస్థాయిలో సక్సెస్ అవుతుంది. మాచర్ల నియోజకవర్గంలో తాగు, సాగునీరు లేదు. మేము గెలిచిన ఏడాదిలోపు వరికపూడిశెల పూర్తి చేసి నీరందిస్తాం. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తాం. సాగర్ కుడి కాల్వను స్థిరీకరించి గోదావరి జలాల ద్వారా ఆయకట్టుకు నీరందిస్తాం. బ్రహ్మారెడ్డి మాచర్లకి ఒంటరిగా వచ్చారు.. మీ బలంతో గెలిపించాలి

ఓట్ల పండక్కి.. వస్తున్నారు



- రైళ్లు, బస్సు సర్వీసులన్నీ ఇప్పటికే ఫుల్
- ఓటు వేయాలనే పట్టుదలతో ప్రయాణం
- దూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు రాక
- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి అధిక సంఖ్యలో
- ఓటర్ల కోసం కొందరు అభ్యర్థులు ప్రత్యేకంగా రవాణా ఏర్పాట్లు
- చార్జీలను పెంచిన ట్రావెల్స్.. హైదరాబాద్‌కు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కాదు.. దసరా సెలవులు లేవు.. అయినా దూర ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు తరలివస్తోన్నారు. ఓటు వేయాలనే పట్టుదలతో పండుగలకు వస్తోన్నట్లు తరలివస్తోన్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఓట్ల పండుగకు సొంతూళ్లకు తరలివస్తోన్నారు. సొంతూరుకి వచ్చి ఓటు వేసేందుకు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లు ఉత్సాహం చూపుతున్నారు. స్వచ్ఛందంగా కొందరు ఓటర్లు ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో రైళ్లు, బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముందస్తు ఏర్పాట్లు చేసుకోని వారు ప్రత్యేక వాహనాల్లో బయల్దేరారు. ఈ నెల 11 (రెండో శనివారం), 12 (ఆదివారం), 13 (పోలింగ్ రోజు) వరుస సెలవు దినాలు కావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే స్వస్థలాలకు ప్రయాణమయ్యారు. శుక్రవారం వివిధ కారణాలతో రాలేకపోయిన వారు శని, ఆదివారాల్లో స్వస్థలాలకు వచ్చేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఉద్యోగులే కాకుండా చికిత్స రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న వారు కూడా ఓటు వేయాలని పట్టుదలతో వస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు. ప్రతి ఓటును గెలుపుకు కీలకంగా భావిస్తున్న తరుణంలో అభ్యర్థులు తమ నియోజకవర్గాల పరిధిలో ఓటర్లుగా నమోదై ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని స్వస్థలాలకు రప్పించడానికి వారం రోజుల నుంచి కసరత్తు చేస్తున్నారు. ఫోన్ చేయడం, వారి రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై వివరాలు అడిగి వారు రావడానికి కావాల్సిన అన్ని సదుపాయాలను సమకూర్చారు. దీంతో ఓటు వేసేందుకు పలువురు ఆసక్తితో స్వస్థలాలకు బయల్దేరారు. సైబరాబాద్‌లో ఉద్యోగాలు, ఉపాధి పొందిన వారిలో వేల మంది ఆ రుణాన్ని తీర్చుకోవాలని భావించి తరలివస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో జిల్లాకు చెందిన వేల మంది ఉద్యోగ, ఉపాధి రీత్యా ఉంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే చాలామంది రైళ్లు, బస్సుల్లో టిక్కెట్లు బుకింగ్ చేసుకున్నారు. ప్రత్యేక రైళ్లు, ఆర్టీసీ నిత్యం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నా వాటిలో టిక్కెట్లు రిజర్వు అయిపోయాయి. ప్రైవేటు ఆపరేటర్లు టిక్కెట్ చార్జీలను పెంచేశారు. ట్రావెల్స్‌లో హైదరాబాద్ నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేలు, బెంగళూరు నుంచి అయితే టిక్కెట్ ధర రూ 4 వేలు పలుకుతోంది. ఈ రేట్లకు టిక్కెట్ కొనుగోలు చేద్దామన్నా దొరికే పరిస్థితి లేదు. హైదరాబాద్ నుంచి ఏసీ స్లీపర్‌లో రూ.2,601 చార్జీగా నిర్ణయించారు. బెంగళూరు ఇతర ప్రాంతాల నుంచి కూడా బస్సుల్లో టిక్కెట్లు బుక్ అయిపోయాయి. ఈ క్రమంలో సొంత ఖర్చులతో వచ్చిన వారికి ఆ మొత్తం తిరిగి చెల్లిస్తామనే హామీని ఇస్తూ ఓటర్లను అభ్యర్థులు స్వగ్రామాల బాట పట్టిస్తున్నారు. టిక్కెట్లు లభించక ఇబ్బందులు పడుతున్న వారి కోసం హైదరాబాద్ నుంచి ఆయా పార్టీల అభ్యర్థులకు చెందిన అనుచరులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల కు కనీసం 50 వేల మందికిపైగా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో దాదాపు 35 నుంచి 40 వేల మంది ఓటర్లు ఉండగా వారిలో ఎక్కువ మంది స్వస్థలాలకు రానున్నట్లు సమాచారం. దీంతో జిల్లా పరిధిలో ఆర్టీసీ శుక్రవారం రాత్రి నుంచి దాదాపు 50 ప్రత్యేక సర్వీసులను హైదరాబాద్ నుంచి నిర్వహిస్తున్నది.

13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

● సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాస్ కుమార్ వెల్లడి

గుంటూరు(తూర్పు), మే 10: ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈనెల 13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఉమ్మడి గుంటూరు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలోని పరిశ్రమలు, సినిమా హాల్స్ ఇతర దుకాణదారుల యాజమానులకు సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్ శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. సదరు సెలవు రోజున కార్మికుల వేతనాలలో ఎటువంటి తగ్గింపు చేయవద్దని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే సదరు యాజమానికి జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమస్యలు, ఫిర్యాదుల కోసం 94925 55145 నెంబరును సంప్రదించాలని సూచించారు.

వస్త్రవ్యాపారి ఇంటిపై ఐటీ దాడులు

● గురువారం తెల్లవారుజాము నుంచే మొదలైన సోదాలు

మంగళగిరి, మే 10: స్థానిక మంగళగిరి మెయిన్‌బజారులో ఉన్న ప్రముఖ వస్త్ర వ్యాపారి ఇంటిపై ఐటీ అధికారులు దాడులు చేశారు. మెయిన్‌బజారుకు అనుబంధంగా వున్న భాగవతులవారి వీధిలో ఉంటున్న సదరు వ్యాపారి ఇంట్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఈ దాడులు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. నగరంలో భారీ వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తుండడంతో పాటు వడ్డీలు, చిట్స్ వంటి ఇతర వ్యాపారాలను కూడ ఈ వ్యాపారి నిర్వహిస్తూ వుంటారు. ఐటీ అధికారులు కచ్చితమైన సమాచారం మేరకే ఈ దాడులు చేసినట్టు తెలుస్తోంది. గురువారం తెల్లవారుజామునుంచి మొదలైన ఈ సోదాలు శుక్రవారం సాయంత్రం వరకు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. వ్యాపారి నివాసం అండర్‌గ్రౌండ్‌లో అయిదు అడుగుల ప్రత్యేక లాకర్‌ను చాలా పకడ్బందీగా ఏర్పాటు చేసుకున్నట్టు ఐటీ అధికారులు తమ సోదాలలో గుర్తించారంటున్నారు. ఈ లాకర్‌లో వందల కిలోల కొద్దీ కొన్ని వెండి వస్తువులు, మరికొన్ని బంగారు ఆభరణాలు, బంగారు బిస్కెట్లు, పెద్దఎత్తున చెక్కులు, ప్రామిసరీ నోట్లు, మరికొన్ని డాక్యుమెంట్లు ఉన్నట్టు చెబుతున్నారు. రూ.కొన్ని కోట్ల నగదును కూడ ఐటీ అధికారులు కనుగొన్నట్టు ప్రచారం జరుగుతోంది. పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావల్సి ఉంది.



యడ్లపాడు సొసైటీ స్థలంలో భోజనాల కోసం వైసీపీ నాయకులు వేసిన టెంట్లు

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన

● సొసైటీ స్థలంలో టెంట్లువేసి భోజనాలు

యడ్లపాడు, మే 10: ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో పార్టీ తరపున ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదని నిబంధనలు ఉన్నా ఖాతరు చేయడం లేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు యడ్లపాడులో రోడ్‌షో నిర్వహించాడు. రోడ్‌షోలో పాల్గొన్న వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు విందు ఏర్పాటు చేశారు. యడ్లపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో టెంట్లువేసి భోజనాలను వడ్డించారు. ఒక పక్క ఎంపీడీవో కార్యాలయం, మరోవైపే పంచాయతీ కార్యాలయం, ఎదురుగా తహసీల్దార్ కార్యాలయం ఉన్నా ఏ అధికారి కూడా సదరు కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయక పోవడం విశేషం.

అపూర్వ ఆదరణ

● మీరు చూపిన కృతజ్ఞతను అభివృద్ధి రూపంలో తిరిగి ఇస్తా
● పెమ్మసాని చంద్రశేఖర్
● ప్రత్తిపాడు మండలంలో రోడ్‌షో
● అన్ని గ్రామాల్లో బూర్ల, పెమ్మసానిలకు బ్రహ్మరథం



రోడ్ షోలో మాట్లాడుతున్న పెమ్మసాని పక్కన బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, మే 10: మీరు మాపై చూపుతున్న కృతజ్ఞతను అభివృద్ధి రూపంలో తిరిగి ఇస్తానని తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రత్తిపాడు మండలంలోని యనమదల, ఈదులపాలెం, నడింపాలెం, రావిపాటివారిపాలెం, ప్రత్తిపాడు, గొట్టిపాడు గ్రామాలలో ప్రత్తిపాడు అసెంబ్లీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తల నడుమ జరిగిన ఈ రోడ్‌షోకు గ్రామస్థులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. పెమ్మసాని, బూర్ల వస్తున్నారని తెలిసిన తెలుగుదేశం పార్టీ అభిమానులు గంటల తరబడి రోడ్డుపై నిలబడి వారి కోసం వేచి చూశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలుపును ఆపడం ఎవరి తరం కాదన్నారు. అవినీతి సొమ్ముతో ఆంధ్రులను కొనలేరని ఆయన తెలిపారు. ఎస్సీలు మీదే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టే పరిస్థితి ఇక్కడ ఉందన్నారు. దళిత డాక్టర్‌ను మాస్క్ అడిగిన పాపానికి ఏ విధంగా చేశారో.. దళిత డ్రైవర్‌ను చంపి ఎలా డోర్ డెలివరి చేశారో అందరూ చూశారా లేదా అని ప్రశ్నించారు. ఉద్యోగులను బిచ్చగాళ్లగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఉద్యోగులు తన వద్దకు వచ్చి ఒకటో తేదీన జీతం పడే విధంగా చూడాలని కోరారన్నారు. పోలీసులు సంఘ వ్యతిరేక శక్తులుగా, అధికారులను బానిసలుగా మార్చి, వారి చేత తప్పులు చేయించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు దోచి నేడు గ్రామాలలో పంచుతున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంత డబ్బు పంచుతున్నారంటే ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి యాజమాన్యానికి లీగల్ నోటీసులు

● నాపై చేసిన ఆరోపణలకు 10 రోజుల్లో మీ ఛానెల్‌లోనే క్షమాపణ చెప్పాలి..
● లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవు
● డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరిక

గుంటూరు, మే10(ఆంధ్రజ్యోతి): తనపై చేసిన అసత్య ఆరోపణలపై గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సీరియస్‌గా స్పందించారు. సాక్షి యాజమాన్యానికి శుక్రవారం ఆయన తరపున ప్రముఖ న్యాయవాది డీ. కోటేశ్వరరావు ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. సాక్షి తెలుగు టీవీ ఛానెల్ (ఇందిరా టెలివిజన్ లిమిటెడ్) ఛైర్మన్ వైఎస్ భారతిరెడ్డి, డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాదరెడ్డి, హోల్ టైమ్ డెరెక్టర్ బండి రాణిరెడ్డికి ఆయన లీగల్ నోటీసులు జారీ చేశారు. సాక్షి ఛానల్‌లో ఈనెల 5వ తేదీన తనపై ఆయనొక ఎన్నారై.. అడ్డదిడ్డంగా డబ్బు సంపాదించారు.. చంద్రబాబును ఆశ్రయించి 200 కోట్లు ముట్టజెప్పి గుంటూరు పార్లమెంటు సీటు కొట్టేశారు. చిన్నబాబుకు 100 కోట్లు ప్యాకేజీ ఇచ్చారు' అంటూ తప్పుడు కథనాల ప్రసారం చేయడంతో పాటు యూట్యూబ్‌లో అదేపనిగా ప్రసారం చేశారని ' ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది, తన మిత్రులు, బంధువులు, సహచరులు, రాజకీయ ప్రముఖులు ఆ ప్రసారాలను చూశారని, అసత్య ఆరోపణల వల్ల తన పేరు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని పెమ్మసాని ఆవేదన వ్యక్తంచేశారు. ఏ సాక్షిఛానెల్, యూట్యూబ్‌లలో అయితే తనపై తప్పుడు ఆరోపణలు చేశారో అవే ఛానెళ్లలో పది రోజుల్లో తనకు క్షమాపణ చెబుతూ ప్రసారాలు చేయాలని, రూ. 100 కోట్లు నష్ట పరిహారం చెల్లించాలని ఆ లీగల్ నోటీసులో డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాను తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారని పెమ్మసాని చంద్రశేఖర్ హెచ్చరించారు.

ఏ ముఖం పెట్టుకుని మళ్లీ వస్తారు?

● జగన్‌ను ప్రశ్నించిన ప్రత్తిపాటి



ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే 10: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చిలకలూరిపేట ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని ఇక్కడకు ఎన్నికల ప్రచారానికి వస్తారని మాజీమంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రశ్నించారు. సీఎం జగన్ ప్రచారం నిమిత్తం చిలకలూరిపేటకు రానున్న నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లెల రాజేష్ నాయుడితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఇక్కడికి వచ్చినపుడు జరిగిన సభలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. యడవల్లిలోని దళితులకు సాగు భూమి పట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలానే 98శాతం పూర్తయిన 4,512 టిడ్కో ఇళ్లు ఐదేళ్లుగా ఎందుకు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వలేదని అన్నారు. జగనన్న కాలనీల పేరిట జరిగిన భారీ అవినీతిలో జగన్, స్థానికమంత్రి పాత్ర ఏమిటో కూడా ప్రజలకు చెప్పాలన్నారు. రజిని అడిగిందని రూ.65 కోట్లు నిధులు ఇస్తున్నట్లు ఊదరగొట్టిన జగన్, తర్వాత ఒక్కరూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు, చిలకలూరిపేట దాహార్తి తీర్చే అమృత్ పథకం ఎందుకు పూర్తిచేయలేదనీ నిలదీశారు. 35 వేలమంది ముస్లింలు నివసించే చిలకలూరిపేటలో ఆటోనగర్ పూర్తిచేసి ఉంటే మహీంద్రా, టాటాలు వంటి పెద్ద కంపెనీలు వచ్చే అవకాశం ఉన్నా దానిని ఎందుకు పట్టించుకోలేదన్నారు. అనంతరం మాట్లాడిన మల్లెల రాజేష్ నాయుడు చిలకలూరిపేట ప్రజలు పార్టీలకు అతీతంగా ఆలోచించి మోసంచేసిన వాళ్లను పక్కనపెట్టి మంచి చేసేవాళ్లకే అవకాశం ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీల విడదలరజిని చేసిన మొట్టమొదటి మోసం డబ్బులు వసూలు చేయడమేనన్నారు. చిలకలూరిపేట రైతులను, దళితులను మోసంచేసి వ్యాపారుల నుంచి దండుకుంటున్న విడదల రజినీని ఇక్కడ తరిమితరిమి కొడతారనే భయంతో జగన్‌రెడ్డిని బతిమిలాడుకొని గుంటూరు పారిపోయిందన్నారు. ఇప్పుడు చిలకలూరి పేట సరిహద్దులు కూడా తెలియని వ్యక్తి మనోహర్‌ను ఇక్కడకు తెచ్చార న్నారు. అతడు గుంటూరులో చేసిన దందాలు సరిపోక ఇక్కడికి వచ్చి కాపు కులాన్ని అడ్డుపెట్టుకొని మోసం చేస్తున్నారన్నారు. ఇవన్నీ గమనించే ప్రజలు ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకర నేత్ర చికిత్సాలయ వైద్యులు

ఓటు వేయండి.. ఉచిత కంటి వైద్యాన్ని పొందండి

● ఓటు హక్కుపై అవగాహన కోసం వినూత్న ప్రయత్నం

తెనాలి, మే 10(ఆంధ్రజ్యోతి): ఓటు వేయండి.. వేసి వచ్చాక మీచేతి వేలిపై ఉన్న సిరా చుక్కను చూపిస్తే చాలు... ఉచితంగా కంటి పరీక్షలు చేస్తాం. శుక్లాల ఆపరేషన్‌ల వంటివికూడా తక్కువ ధరలో చేస్తామంటూ తెనాలిలోని శంకర నేత్ర చికిత్సాలయం ఓ ఆఫర్‌ను గోడప్రతుల ద్వారా విడుదల చేసింది. ఓటు హక్కు విలువ తెలియచేయటం, వారి హక్కును సద్వినియోగం చేసుకునేలా వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ అవకాశాన్ని ఇస్తున్నామని ఆస్పత్రి ఎండీ డాక్టర్ నదెళ్ల స్వాతి తెలిపారు. ఈమేరకు శుక్రవారం గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ నెల 13న పోలింగ్‌లో పాల్గొని ఈ నెల 31వ తేదీలోపు ఎపుపడు వచ్చి వేలిపై ఉన్న సిరా గుర్తును చూపితే అపుపడు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తామన్నారు.

పోలీసు అధికారుల నియామకం

నరసరావుపేట, మే10: మాచర్ల నియోజకవర్గంలో వైసీపీకి కొమ్ముకాస్తున్న ముగ్గురు పోలీసు అధికారులను ఎన్నికల కమిషన్ బదిలీ చేయగా ఆయా స్థానాల్లో కొత్తగా పోలీసు అధికారులను నియమిస్తూ శుక్రవారం ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. కారంపూడి సీఐగా టీపీ నారాయణస్వామి, మాచర్లపట్టణ సీఐగా బీ.బ్రహ్మయ్య, వెల్దుర్తి ఎస్‌ఐగా ఎం.వెంకట్రావులను నియమించింది. వైసీపీ అనుకూలంగా ఉంటున్నారన్న ఆరోపణలతో మాచర్ల పట్టణ సీఐ పీ.శరత్‌బాబు, కారంపూడి సీఐ బీ.చిన్నమల్లయ్య, వెల్దుర్తి ఎస్‌ఐ వంగా శ్రీహరిలను బదిలీచేసిన విషయం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మంగళగిరి సిటీ, మే 10: బైకుపై వెళుతున్న ఓ విద్యార్థిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సత్తెనపల్లికి చెందిన గాడిద పాటి నవీన్ (16) ఇటీవలే పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాడు. నవీన్ తండ్రి తాడేపల్లిలోని ఓ అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తుంటాడు. తండ్రి వద్దకు వచ్చిన నవీన్ శుక్రవారం ఉదయం ఎవ్వరికీ చెప్పకుండా ద్విచక్ర వాహనంపై బయటికి వచ్చాడు. మంగళగిరి మండలం ఆత్మకూరు హ్యాపీ రిసార్ట్స్ వద్దకు వచ్చేసరికి సర్వీసు రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు నవీన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలకు విద్యుత్ శాఖ

ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు

గుంటూరు, మే 10: ఈనెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గుంటూరు జిల్లావ్యాప్తంగా సర్కిల్ కేంద్రంతో పాటు డివిజనల్ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్‌ఈ ఆవుల మురళీకృష్ణయాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించామన్నారు. 24 గంటలు నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. గుంటూరు సర్కిల్ కార్యాలయం కంట్రోల్ రూమ్ సెల్ 9440817526, గుంటూరు టౌన్-1 డివిజన్ 9440817527, తెనాలి డివిజన్ 9440817535, బాపట్ల డివిజన్ 9491 052945, నరసరావుపేట డివిజన్ 9440817539, మాచర్ల డివిజన్ 9440817531లను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు వాటిల్లినా వెంటనే ఆయా కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

రాజుపాలెం, మే10: గుంటూరు-మాచర్ల రహదారిపై మండల పరిధిలోని రాజుపాలెం గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు... ఏలూరు మండలం ప్రతికూలంక గ్రామానికి చెందిన బలే విజయకుమార్(34) లారీడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో విజయకుమార్ మాచర్ల పట్టణంలో సిమెంటు లారీలో లోడు చేసుకొని ఏలూరుకు బయల్దేరాడు. మార్గం మధ్యలోని రాజుపాలెం గ్రామ సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వద్దకు చేరుకొంది. లారీ వెనుక టైర్ గాలి తగ్గినట్టు ఉంటే లారీని ఆపి టైర్‌ను చెక్ చేసుకునే పనిలో నిమగ్నమయ్యాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో విజయకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై షామీర్‌బాషా సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

క్వారీల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

● రూ.1.49లక్షల అపరాధరుసుం విధింపు

యడ్లపాడు, మే 10: మెటల్ క్వారీల్లో మైనింగ్ విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 8న నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో బిల్లులు లేకుండా మెటల్ తరలిస్తున్న రెండు టిప్పర్‌లతోపాటు లోడింగ్‌కు ఉపయోగిస్తున్న రెండు ఎస్కవేటర్‌లను అధికారులు సీజ్‌చేశారు. వెంకటరమణ స్టోన్ క్రషర్‌కు చెందిన ఒక ఎస్కవేటర్ రెండు టిప్పర్‌లు, బాబా స్టోన్ క్రషర్‌కు చెందిన ఎస్కవేటర్‌ను సీజ్ చేసిన అధికారులు స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం వెంకటరమణ స్టోన్ క్రషర్‌కు చెందిన వాహనాలకు మైనింగ్ అధికారులు రూ.1.49లక్షలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. కాగా బాబా క్రషర్‌కు చెందిన ఎస్కవేటర్‌కు సంబంధించి అపరాధరుసుం విధించలేదని విజిలెన్స్ ఏడీ శివాజి తెలిపారు.

రాక్షస పాలనని అంతమొందిద్దాం..

● బ్రాహ్మణ సమాజం పిలుపు

గుంటూరు, మే 10: రాష్ట్రంలో రాక్షసపాలనని 'ఓటు' తో అంతమొందిద్దాం ... జగనాసుర సంహారానికి ముహూర్తం ఖరారు చేసిన త్రిమూర్తులు... అన్ని వర్గాలు కలసికట్టుగా కూటమి అభ్యర్థుల్ని గెలిపించుకుందాం... అని బ్రాహ్మణ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం బ్రాహ్మణ చైతన్య వేదిక, అర్చక సేవా సంఘం సంయుక్తంగా గుంటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ, అర్చక సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి మాట్లాడుతూ త్రేతాయుగం, ద్వాపర యుగంలో రాజ్య పరిపాలనలను సక్రమంగా నిర్వహించకుండా రాజులు, మునులు, ప్రజలు, దేవతలపై అప్పట్లో రాక్షసులు దాడులకు దిగుతూ హింసలకు గురిచేస్తూ హత్యలు దోపిడీలు చేస్తూ అరాచకం సృష్టించే వారని, అలాంటి సందర్భంలో బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు వివిధ రూపాల్లో అవతారాలు ఎత్తి రాక్షసులను సంహరించే వారన్నారు. అలానే ఈ కలియుగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనే రాక్షస మనస్తత్వం కలిగి మాయ మాటలు చెప్పి ఒక్క ఛాన్స్ అని ప్రజల్ని మోసం చేసి గత ఐదేళ్లుగా క్రూర రాక్షస పరిపాలన కొనసాగించాడన్నారు. అతని పాలనలో ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, అన్ని కుల, మత వర్గాల వారు అనేక హింసలకు, దాడులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. రాక్షసుడు అని తెలియక నమ్మి మోసపోయామని ప్రజలు, ప్రతిపక్షాలు వాపోతున్న సమయంలో ఆ త్రిమూర్తులు ఎన్నికల రూపంలో ప్రజల చేతిలో ఈ రాక్షసుడిని అంతమొందించేందుకు ఈనెల 13 తేదీన ముహూర్తం ఖరారు చేశారన్నారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ముస్లిం, క్రిస్టియన్, మార్వాడి కుటుంబాలు, వివిధ కులవర్గాలవారు ఈ ప్రభుత్వ విధానాలపై తిరగబడి త్రిమూర్తులు ఇచ్చిన అవకాశాన్ని ఓటు అనే ఆయుధంతో ఈ జగనాసురుడ్ని సంహరించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు కొప్పర్తి సీతారమేష్, బొడ్డుపల్లి శ్రీనివాసు, నల్గొండ రాధాకృష్ణమూర్తి, బందా శశిధర్, వేదాంతం శ్రీనివాస్, ప్రతాప ప్రసాద్, లంకా రవి, ఐలూరి శ్రీనివాస్, వడ్డమాను ప్రసాద్, చిలుమూరు ఫణి, ఐలూరి నాని పాల్గొన్నారు.

ముస్లిం లీగ్ పార్టీ వైసీపీకి మద్దతు ప్రకటించలేదు

● సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటనని తీవ్రంగా ఖండిస్తున్నాం
● ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బషీర్ అహ్మద్

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ముస్లిం లీగ్ పార్టీ వైసీపీకి మద్దతు ప్రకటించిందని సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటనను ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది బషీర్ అహ్మద్ తీవ్రంగా ఖండించారు. వాస్తవంగా ఓటమి భయం పట్టుకున్న వైసీపీ ముస్లిం లీగ్ ఓట్లను దొంగలించడం కోసం లెటర్ హెడ్‌పై ఇండియన్ ముస్లిం లీగ్ అనే పేరుతో నకిలీ సంస్థను ఏర్పాటు చేసి ఈ అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై గుంటూరులోని పట్టాభిపురం పోలీసుస్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. స్వయం ప్రకటిత ఇండియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించుకున్న హుస్సేన్ బాషా, అతని సహచరులు తోటి కుట్రదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైసీపీ కేంద్ర కార్యాలయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సజ్జల కావాలనే ఈ నకిలీ సంస్థతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించాడని, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీని ఎదుర్కొనలేక దొంగ దెబ్బలు తీయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో ముస్లింలు ఎవరు వైసీపీ వైపు లేరని కేవలం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ వైపే ఉన్నారని స్పష్టమైనది అన్నారు. ఇటువంటి కుట్ర చిల్లర పనులను మానివేయాలని సజ్జలను హెచ్చరించారు. తమ పార్టీ ఎవరికి కూడా మద్దతు ప్రకటించలేదని తాము అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేస్తున్నామని ప్రజలు గమనించాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



బెల్లంకొండ సమావేశంలో మాట్లాడుతున్న రఫీ


ముస్లింలకు తీరని అన్యాయం చేసిన జగన్

● రాష్ట్ర ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షులు రఫీ

బెల్లంకొండ, క్రోసూరు, మే10: రాష్ట్రంలో ముస్లింలకు సీఎం జగన్‌రెడ్డి తీరని అన్యాయం చేశారని టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ ఆరోపించారు.. శుక్రవారం ఉదయం బెల్లంకొండ, క్రోసూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముస్లిం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రఫీ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి ఛైర్మన్‌లను కుర్చీలకే పరిమితం చేశారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వలాభం కోసం ముస్లింలను వాడుకున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అమలైన పథకాలను తొలగించారని, ముస్లిం బరియల్ గ్రౌండ్‌లకు ప్రహరీ నిర్మిస్తామని హామీలు ఇచ్చి విస్మరించారన్నారు. ముస్లింల రిజర్వేషన్‌లో చంద్రబాబు నాయుడు స్పష్టమైన వైఖరిని ప్రకటించారన్నారు. రిజర్వేషన్‌ల పట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం వస్తే ముస్లింలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో మైనార్టీ సెల్ నాయకులు సలాం, బెల్లంకొండ మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, బెల్లంకొండ వైస్ సర్పంచ్ సుభానీ, గ్రామ టీడీపీ అధ్యక్షులు ఇబ్రహీం, ముస్తఫా, చిట్టి, సయ్యద్ జబ్బార్, సయ్యద్ మజీద్, సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. క్రోసూరులో రాష్ట్ర షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మస్తాన్, క్రోసూరు మాజీ వైస్ ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా, పెదకూరపాడు మండల వైస్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దళిత బిడ్డల పాలిట శకుని మామ జగన్

● మాల మహానాడు వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు



మల్లెల వెంకట్రావు

పొన్నూరుటౌన్, మే10: రాజ్యాంగ సంక్షేమ పథకాలను రద్దు చేసి దళిత బిడ్డల పట్ల శకుని మామగా జగన్ రెడ్డి మారాడని మాల మహా సభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు ఆరోపించారు. శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ జగన్ నవరత్నాలు, ఎస్సీ ఎస్టీలకు సమాధి రాళ్లుగా మారాయని దుయ్యబట్టారు. వైసీపీ మేనిఫెస్టో టిష్యూ పేపర్‌గా పేర్కొన్నారు. దళితుల సానుభూతి ఓట్లతో గద్దెను ఎక్కిన జగన్ రెడ్డి అధికారం వచ్చిన తర్వాత 9 వేల ప్రాథమిక పాఠశాలను రద్దు చేశారని ధ్వజమెత్తారు. ఉద్యోగాల్లో ప్రమోషన్ల జాబితాలో రిజర్వేషన్ల రద్దును వైసీపీ ప్రభుత్వంలో జరిగిందని ఆరోపించారు. దళితులకు ఇన్ని పథకాలు రద్దు చేసిన జగన్‌ను కొందరు ఉద్యమకారులు నిస్సిగ్గుగా సమర్థించటం అనైతిక చర్య అని అన్నారు. పాలక వర్గాల పాదాల వద్ద దళితుల రాజ్యాంగ హక్కులను పణంగా పెట్టడమేనని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 82 మంది మాలలను చంపిన వైసీపీ మూకలకు దళిత ఉద్యమ మేధావులు ఏవిధంగా మద్దతు ఇస్తారని మల్లెల ప్రశ్నించారు. రాయితీలు, సంక్షేమ ఫలాలు రద్దు చేసిన జగన్ మంచి పాలకుడో, జగన్ భజనలు చేస్తున్న దళిత మేధావులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మేధావులు పేరుతో దళిత ద్రోహులకు భజన చేస్తున్న అద్దె మైకులతో ఎస్సీ, ఎస్టీలు జాగరూపుతో ఉండాలని హెచ్చరించారు. జగన్ రద్దు చేసిన పథకాలు తిరిగి ప్రారంభం కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేసారు.



మూడు ముక్కలాటతో రాష్ట్రం నాశనం

● 1606వ రోజుకు ఆందోళనలు..



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

తుళ్లూరు, మే 10: విజనరికి ఓటు వేయాలని, విధ్వంసకుడిని ఇంటికి పంపాలని రాష్ట్ర ప్రజలకు, రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు విజ్ఞప్తి చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అంటూ దర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు 1606వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. అమరావతిని అభివృద్ధి చేయమని హైకోర్టు చెప్పిన పెడచెవిన పెడుతున్న జగన్‌రెడ్డి ప్రజల గోడు ఎలా వింటాడన్నారు. నియంత పాలన మనకొద్దని, విజన్ ఉన్న నాయకుడిని ఎన్నుకుందామని విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164, 175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

60,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 51,030 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 60,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,866 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	17500
నెంబరు. 5	10000	16000
273	10500	13000
341	9000	17000
4884	10000	13000
సూపర్ 10	9000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	10000	14000
దేవనూరు డీలక్స్	9000	13000
తెల్లహంసలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



బూర్లె అనీల్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకుంటున్న నరేంద్రవర్మ, అన్నం సతీష్ ప్రభాకర్

టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు బూర్లె

బాపట్ల, మే 10 : వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకుడు, మిఠాయి పొట్లాం అధినేత బూర్లె అనీల్‌కుమార్ శుక్రవారం రాత్రి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో ప్రచార వాహనంపై పార్టీలో చేరారు. కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలలో టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరిక

బాపట్ల, మే 10 : బాపట్ల పట్టణం మున్నంవారిపాలేనికి చెందిన సుమారు 60 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధనరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. శుక్రవారం బాపట్ల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు శివసాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ విస్తృత ప్రచారం

బాపట్ల, మే 10 : మండలంలోని అప్పికట్ల గ్రామంలో శుక్రవారం కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేగా వేగేశన నరేంద్రవర్మలను గెలిపించాలని కోరుతూ గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. వీధి వీధిన తిరుగుతూ బ్యాలెట్ నమూనా చూపిస్తూ మేనిఫెస్టో గురించి వివరిస్తూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టే కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఇనగంటి గాంధీ, రాష్ట్ర మహిళా కార్యదర్శి మానం విజేత, గ్రామ సర్పంచ్ గుత్తికొండ రజనీ, రాజేష్, అచంట విజయ్, కుర్రా ప్రభాకరరావు, బూత్ ఇన్‌చార్జిలు అమర్‌నాద్, శ్రీనివాసరావు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలి

● కలెక్టర్‌ను కోరిన టీడీపీ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్, చెంచు గరటయ్య

బాపట్ల, మే 10 : బాపట్ల పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో హింసాత్మక ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్, పార్లమెంట్ పరిశీలకుడు బాచిన చెంచు గరటయ్య కోరారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ అంశాలు గురించి కలెక్టర్‌కు వివరించారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి : బాచిన

బాపట్ల, మే 10 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు సైనికునివలే పని చేయాలని టీడీపీ పార్లమెంట్ పరిశీలకులు బాచిన చెంచు గరటయ్య తెలిపారు. మండలంలోని అప్పికట్ల గ్రామంలో శుక్రవారం టీడీపీ ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో చెంచు గరటయ్య మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మల గెలుపు కోసం పని చేయాలన్నారు. ఐక్యంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సాయుధబలగాలు పనిచేయాలి

● ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల, మే 10 : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సాయుధ బలగాలు పని చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన, ప్రస్తుతం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్, టిఎస్ఎస్‌పీ కంపెనీల అసిస్టెంట్ కమాండెంట్లతో శుక్రవారం ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగటానికి పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలుగు బీఎస్ఎఫ్, మూడు టీఎస్ఎస్‌పీ కంపెనీలను స్ట్రాంగ్‌రూమ్స్ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాలు, ఇతరప్రదేశాలలో మోహరించటం జరుగుతుందన్నారు. సాయుధబలగాల సిబ్బంది స్థానిక పోలీసు అధికారులతో పాటు స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్‌ఫోర్స్, రూట్‌మొబైల్ పార్టీలలో కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సమర్థ్ మొబైల్ యాప్‌ను ఇప్పటికే జిల్లా అధికారులు, సిబ్బంది వినియోగిస్తున్నారన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు రాజేష్ షెకావత్, బ్రిజ్‌కిషోర్‌నేగి, ఆర్‌కె భారతి, జిడి సంజీవ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసు అసిస్టెంట్ కమాండెంట్‌లు టి.కాళీదాసు, బి.సీతారాం, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలి : కలెక్టర్

భట్టిప్రోలు, మే 10: ఎన్నికల విధుల్లో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలను అనుసరించాలని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌భాషా అన్నారు. మండలంలో శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి విస్తృతంగా పర్యటించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక టీఎంరావ్ హైస్కూలులో గల 214 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వెబ్‌కాస్టింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్‌మీడియం హైస్కూలులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను పరిశీలించి మెటీరియల్ పంపిణీకి తగిన ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి కెవిబి వసంతరాయుడు, తహసీల్దార్లు మునిలక్ష్మీ, కిరణ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీలపై పెరిగిన దాడులు : పాలేటి

బాపట్ల, మే 10 : వైసీపీ పాలనలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు తెలిపారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని విమర్శించారు. దళితులకు సంబంధించిన 27 పథకాలు నిర్వీర్యం చేశారన్నారు. పేదవారి సొంత ఇంటికలను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు అన్నం పెట్టిన అన్నాక్యాంటీన్‌లు మూసివేయించారన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, కార్యదర్శి సుధీర్‌కుమార్, ఫణేంద్రకుమార్, శ్రీకాంత్, సాగర్, ప్రకాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు చంద్రబాబు ఒక భరోసా : హనీఫ్

వేమూరు, మే 10: రాష్ట్రంలోని ముస్లింలకు తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక భరోసా అని టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్ తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని జంపనిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముస్లింల ఇళ్లకు వెళ్లి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైసీపీ నాయకులు దుష్ప్రచారాలను చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ముస్లింల సంక్షేమం కోసం అనేక పథకాలను ఏర్పాటు చేశారని, వాటన్నింటినీ జగన్ పాలనలో తుంగలో తొక్కారన్నారు. ఎన్నికల్లో ముస్లింలంతా వేమూరు అసెంబ్లీ అభ్యర్థి నక్కా ఆనందబాబుకు బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు ఓటు వేసి అఖండ మెజార్టీని చేకూర్చి పెట్టాలని కోరారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటు స్థాయి ముస్లిం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ ఖాశిం, వేమూరు నియోజకవర్గం ఉపాధ్యక్షుడు షేక్ షరీఫ్, పీర్ అహ్మద్, ఆలీ, హమీద్‌ఖాన్, ఫజురుల్లాహ్ పాల్గొన్నారు.

114 మద్యం సీసాలు పట్టివేత

కర్లపాలెం, మే 10 : కర్లపాలెం మండలంలోని దుండివారిపాలెం పంచాయతీ బిడారు దిబ్బలో మందపాటి కోటయ్యకు చెందిన స్థలంలో ఉన్న గడ్డివామిలో 114 మద్యం సీసాలు ప్రత్యేక టీమ్ పట్టుకున్నారని ఎస్సై జనార్దన్ తెలిపారు. మద్యం సీసాలు పట్టుకున్న టీమ్‌లో కానిస్టేబుల్ రాజు తదితరులు ఉన్నారు.

కూటమి గెలుపును ఎవరూ ఆపలేరు

● పవన్‌కల్యాణ్ ఆలోచనకు లాల్ సలాం

● మాజీ మంత్రి ఆనందబాబు



చావలిలో ప్రచార వాహనంపై నుంచి అభివాదం చేస్తున్న ఆనందబాబు

వేమూరు, మే 10 : రాష్ట్రంలో కూటమి గెలుపును ఎవరూ ఆపలేరు.. రాష్ట్ర ప్రజల కోసమే కూటమి ఏర్పాటు చేశారని, ప్రధానంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కూటమి ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. మండలంలోని చావలిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మంచి ఆలోచనతో కూటమి ఏర్పాటుకు కృషి చేసిన పవన్‌కల్యాణ్‌కు లాల్ సలాం తెలిపారు. కూటమి పాలన తథ్యమని, కాపుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తామని అన్నారు. జగన్ అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. గతంలో ఎక్కడా లేని విధంగా రైతు భూహక్కు చట్టాన్ని తీసుకువచ్చి సొంత భూమి కలిగిన యజమానికి కూడా ఆ భూమిపై అతడికి హక్కులు లేకుండా సర్వం జగన్‌కే హక్కులు ఉన్నట్లుగా అమల్లోకి తీసుకురావడం వల్ల ప్రతి రైతు తన భూమిపై హక్కును కోల్పోతున్నాడరన్నారు. ఈ విషయాన్ని రైతులు బాగా గమనించాలని, రైతు పక్షపాతి అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌ను రైతులంతా ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. భూ హక్కు చట్టాన్ని కూటమి అధికారంలోకి రాగానే పూర్తిగా రద్దు చేస్తుందన్నారు. అమరావతి రాజధానిగా కొనసాగించడం ద్వారా డెల్టా ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుంది అన్నారు. గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒక్కసారి మంత్రిగా కూడా పని చేసే అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు కలిగించారని, తద్వారా 1100 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధికి ప్రజలందరికీ తెలుసు అన్నారు. చావలి గ్రామంలో తన హయాంలో 15కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. సమీపంలోని రైతు లకు మేలు చేసే విధంగా ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని ప్రారంభించామని, దానిని కూడా మంత్రి నాగార్జున పూర్తి చేయకుండా నిలిపివేశారన్నారు. కూటమి పాలన రాగానే పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న వ్యక్తి గుండాయిజంతో ఎన్నికల్లోకి దిగారని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ తనకు, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆనందబాబుకు గ్రామస్థులు విశేష సంఖ్యలో పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ నాయకుడు గోపాలం త్రినాథ్ గజమాలతో సత్కరించారు. మహిళలు హారతులిచ్చి తిలకం దిద్ది స్వాగతించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు, చెంచు గరటయ్యా, పార్లమెంటు పార్టీ ఇన్‌చార్జి సలగల రాజశేఖర్, నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, గోపాలం సుబ్బారవు, లంకోజు నాగమల్లేశ్వరరావు, గోపాలం త్రినాథ్, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా విభాగం కార్యదర్శి సోమరౌతు అను రాధ, మండల కార్యదర్శి వెంకటసుబ్బయ్య, గుప్తా ధర్మేంద్ర, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్ మోసపూరిత మాటలు నమ్మకండి : ఆనందబాబు

కొల్లూరు, మే 10: వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలు దగా పడ్డాయని, ప్రజలంతా భావి తరాల భవిష్యత్తు గురించి ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు తెలిపారు. శుక్రవారం మండలపరిధిలోని దోనేపూడిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలి కారు. భారీ జన సందోహం మధ్య ప్రచార రథంపై ఎన్నికల ప్ర చారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయని, ఒక్కఛాన్స్ పేరుతో ఐదేళ్ల పాటు రాష్ట్రం మొత్తం ఇబ్బందులు పడిందని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కూడా ఎన్నో కష్టాలు పడ్డారన్నా రు. బటన్ నొక్కుడు వల్ల జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. ముఖ్యంగా దళితులను దగా చేసిన ప్రభుత్వం ఇదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే రూ.4 వేలు పించన్ ఇంటికే పంపుతామన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంట్ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్ సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి మీకు సేవ చేసే భాగ్యం కల్పించాలన్నారు. ఆలపాటినగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడిని ఆనందబాబు పరామర్శించి కుటుంబసభ్యులకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చా రు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, జిల్లా నాయకురాలు సోమరౌతు అనురాధ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, పార్టీ నాయకులు వెనిగళ్ల సూర్యప్రకాశరావు, జీఎల్ జీ భగవాన్, వెనిగళ్ల మహేష్, నిమ్మగడ్డ అనీల్, గుత్తికొండ శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆనందబాబుకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

రోడ్ల విస్తరణ పేరుతో దోపిడీ

● ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

● రామాలయాన్ని తొలిగించాలని చూడటం దారుణం



ప్రజలకు అభివాదం చేస్తున్న సతీష్ ప్రభాకర్, నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్, గోవర్ధనరెడ్డి తదితరులు

బాపట్ల,మే 10 : బాపట్ల పట్టణంలో రోడ్ల విస్తరణ పేరిట ఎమ్మెల్యే కోన రఘుపతి పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ ఆరోపించారు. కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ శుక్రవారం సాయంత్రం భారీ ఎత్తున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అన్నం సతీష్ ప్రభాకర్ పాల్గొని ఆయా ప్రాంతాలలో ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ దోపిడి చేసిన వ్యక్తికి మద్దతుఇస్తారా లేక ప్రశాంతంగా బాపట్ల ప్రజలు జీవించేందుకు అవసరమైన తెలుగుదేశం పార్టీని గెలిపిస్తారో మీరే నిర్ణయించుకోవాలన్నారు. బాపట్ల నియోజకవర్గాన్ని ఈ స్థాయిలో దోపిడి చేసిన వ్యక్తి గతంలో ఎన్నడూ లేరన్నారు. బాపట్ల చీలురోడ్డు ప్రాంతంలో ఎప్పటి నుంచో ఉన్న రామాలయాన్ని తొలిగించాలని చూడటం దారుణమన్నారు. ఎమ్మెల్యే తండ్రి విగ్రహాన్ని పెట్టటానికి రామాలయాన్ని తొలిగించాలని చూసిన దుర్మార్గమైన వ్యక్తి బాపట్ల ప్రజలకు అవసరంలేదన్నారు. రామాలయంలోని శ్రీరాముని తొలిగించి ఆయన తండ్రిని పెట్టాలనుకునే కోన రఘుపతి దుర్మార్గపు చర్యలను తిప్పికొట్టాలన్నారు. బాపట్ల నుంచి తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రామాలయం చుట్టూ ఉన్న ప్రహరి పడిపోతే నిర్మించటానికి వచ్చిన వ్యక్తిని బెదిరించి నిర్మించకుండా చేసిన వ్యక్తి కోన రఘుపతి అని విమర్శించారు. దుర్మార్గుడు, అహంకారి, అవినీతిపరుడు బాపట్ల ప్రజలకు అవసరమా అని అన్నం సతీష్ ప్రశ్నించారు? ఓటు ద్వారా ఇలాంటి వ్యక్తులను తరిమికొట్టి వేగేశన నరేంద్రవర్మను ఎమ్మెల్యేగా గెలిపించి దేవాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు.

మత్తు పదార్థాలకు బానిసలవుతున్న యువత : తెన్నేటి

డ్రగ్స్ గంజాయి, నాసిరకం మద్యంతో యువత జీవితాన్ని పాలకులు నాశనం చేస్తున్నారని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల రైల్వేస్టేషన్ పరిసరాలలో గంజాయి తాగుతూ వచ్చిపోయే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. బాలికలు పాఠశాలకు వెళ్ళాలంటే వీరిని చూచి భయపడే పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఇలాంటి వాటిని అరికట్టి స్వచ్ఛమైన పాలన, సేవలందించటానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే యువతకు ఉద్యోగాలు, జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమలు వస్తాయన్నారు. తద్వారా లక్షలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఓటుతో మీ భవిష్యత్తును నిర్ణయించుకోండి : వేగేశన

ఓటు అనే ఆయుధంతో మీ పిల్లల జీవితాన్ని, భవిష్యత్తును మీరే నిర్ణయించుకోవాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బాపట్లలోని సూర్యలంక రోడ్డులో ఇండియన్ గ్యాస్ గోదాం దగ్గర నుంచి గడియార స్తంభం మీదగా అంబేద్కర్ సర్కిల్, పడమర బాపట్ల, ఇంజనీరింగ్ కళాశాల, కొత్తబస్టాండ్, రధంబజార్ మీదగా భారీ ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీనాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున



బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో భారీగా హాజరైన ప్రజలు

జెండాలు చేతబట్టి కేరింతలు కొడుతూ ప్రచారం నిర్వహించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్ల ప్రాంతంలో గంజాయి ఎవరి ఆధీనంలో నడుస్తుందో ప్రజలందరికి తెలుసు అన్నారు. కూటమి అధికారంలోకి వస్తే గంజాయి లేకుండా చేస్తానన్నారు. కళాశాలల పరిసరప్రాంతాలలో విద్యార్థులు గంజాయికి బలిఅవుతున్నారన్నారు. అరికట్టాల్సిన నాయకులు వారికి అండగా ఉంటున్నారన్నారు. తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని నరేంద్రవర్మ కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, తెన్నేటి శిరీషాకుమారి, జిట్టా ప్రమీలా రాణి, గుంటుపల్లి తులసీకుమారి, జిగిరిజారాణి, కళ్ళం హరినాధరెడ్డి తదితర నాయకులు పెద్దఎత్తున పాల్గొని ప్రచారం నిర్వహించారు.

సూపర్‌సిక్స్ పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగులు

● ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటం ఖాయం

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



పల్లపట్లలో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 10 : మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం నిజాంపట్నం మండలం కూచినపూడి, పల్లపట్ల, గరువుపాలెంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని ఎమ్మెల్యే అనగానికి టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తెలుగుదేశం పార్టీ కూటమిని ఆశీర్వదించాలని కోరారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు దీపం పథకం క్రింద ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం పేరుతో ప్రతి చదువుకునే పిల్లలకు ఏడాదికి రూ.15వేలు, 18ఏళ్ళు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ, ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టి మహిళలకు అండగా నిలుస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఒక్క చేత్తో రూ.10లు ఇచ్చి మరోక చేతితో రూ.100 లాగేసుకుంటున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనలో విద్యుత్, బస్సు, పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయి సామాన్యునిపై అధిక భారం మోపారన్నారు. మద్యం నిషేధం గాలికి వదిలేసి సొంతంగా మద్యం వ్యాపారం చేస్తూ నాసిరకం మద్యంతో పేదల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. తీరప్రాంతంలో అభివృద్ధి చేసే విధంగా తనవంతు కృషి చేస్తానని, మీరంతా నాకు అండగా నిలిచి నా గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, నర్రా సుబ్బయ్య, కొలసాని రాము, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, బొర్రా సురేంద్ర, నల్లపాటి యల్లయ్య, బొమ్మిడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కూచినపూడిలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రచారానికి భారీగా హాజరైన ప్రజలు



అచ్యుతపురంనకు చెందిన వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రాష్ట్రాభివృద్ధి కోసమే ఎన్డీయే కూటమి

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 10 : రాష్ట్రాభివృద్ధి, భావితరాల భవిష్యత్తు కోసమే ఎన్డీయే కూటమిగా ఏర్పడటం జరిగిందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం నిజాంపట్నం మండలం అచ్యుతపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కన్నా ఏసుబాబు, చెన్ను సంజయ్, మధుకిరణ్, ఆలపాటి రఘు, తోకట తరుణ్, కారుమూరు రాజు, కారుమూరుకు చెందిన మాజీ శాసనసభ్యులు యడం చెన్నయ్య మనవడు యడం సునిల్, నిజాంపట్నం మండలం గరువుపాలెం, పిల్లలవారిపాలెంకు చెందిన వైష్ణవి హాస్పటల్ అధినేత అరవ సాంబశివరావుకు టీడీపీ కండువా కప్పి ఎమ్మెల్యే అనగాని పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేయండి మీకు అండగా ఉంటానని తెలిపారు. ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించి సమష్టి కృషితో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, కొలసాని రాము, ల్యాబ్ కిషోర్, గుడిఅంక సుబ్బారావు, టి.దుర్గాప్రసాద్, బొర్రా సురేంద్ర పాల్గొన్నారు.

తీరప్రాంతం అభివృద్ధి అనగానితోనే సాధ్యం



ఎమ్మెల్యే అనగానికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న అనగాని కమల

రేపల్లె, మే 10 : తీరప్రాంతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలంటే ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్‌తోనే సాధ్యమని సోదరి అనగాని కమల అన్నారు. రేపల్లె పట్టణంలో పలు వార్డుల్లో ఎమ్మెల్యే అనగాని గెలుపుకోసం శుక్రవారం ఇంటింటా అనగాని కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ముఖ్యంగా యువత ఉద్యోగ అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు తరలివెళ్ళిపోతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగానికి అండగా నిలిచి గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నాగలక్ష్మి, భవిత, వర్షిని, ఉదయశ్రీ, తుమ్మల శాంతి, శ్రీలక్ష్మీ, భార్గవి, రాజేశ్వరి, హైమా, మల్లేశ్వరి, టీడీపీ నాయకులు జీపీ రామారావు, పి.సాయికుమార్, వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



జువ్వలపాలెంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఆనందబాబు

లంక గ్రామాల్లో భారీ ర్యాలీ

● వైసీపీని వీడి టీడీపీలో చేరిన 130 కుటుంబాలు

కొల్లూరు, మే 10 : లంక గ్రామాల్లో కూటమి అభ్యర్థి ఆనందబాబుకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. శుక్రవారం మండలపరిధిలోని జువ్వలపాలెం పంచాయతీ పరిధిలోని గుంటూరుగూడెం, కొత్తగూడెం, శివరామపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు వేములపల్లి రవికిరణ్ ఆధ్వర్యంలో యువత ఆనందబాబును భారీ ర్యాలీతో స్వాగతించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం అనంతరం జువ్వలపాలెం గ్రామంలో వైసీపీకి చెందిన వేమూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ యార్లగడ్డ రోషిబాబు రవికిరణ్ ఆధ్వర్యంలో వేలాది మంది ప్రజల సమక్షంలో నక్కా ఆనం దబాబును కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు వైసీపీకి చెందిన 130 కుటుంబాలు వారు కూడా ఆనందబాబు సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు.

ఆదరించి గెలిపించండి అండగా ఉంటాం : అఖిలేష్

భట్టిప్రోలు, మే 10: ఉమ్మడి కూటమి అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబును ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించండి అండగా ఉంటామని డాక్టర్ నక్కా అఖిలేష్ హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని కోనేటిపు రం, పడమట పాలెం, ఐలవరం గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఐలవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో భారీ ర్యాలీ

భట్టిప్రోలు, మే 10: ఉమ్మడి కూటమి అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ భట్టిప్రోలులో టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి ఎమ్మె ల్యే అభ్యర్థి నక్కా ఆనందబాబు, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని కోరుతూ టీడీపీ, జనసేన జెండాలతో ర్యాలీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు సూపర్‌సిక్స్ పథకాలను తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనపర్తి సుందరరావు, బట్టు మల్లికార్జునరావు, కర్రశ్రీనివాసరావు, శ్రీనివాసరావు, యడ్ల జయశీలరావు, సుధీర్, గొట్టుముక్కల లెనిన్, ఎన్.పద్మజ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు వెంకట సుబ్బయ్య మృతి

రేపల్లె, మే 10 : ఇసుకపల్లిలోని 16వ వార్డులో సీపీఐ సీనియర్ నాయకుడు మేకా వెంకటసుబ్బయ్య (103) గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు ఆ యన మృతదేహానికి అరుణ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, సీపీఎం నాయకులు సీహెచ్ మణిలాల్, ప్రసాద్, టీడీపీ రైతు సంఘ నాయకులు నల్లూరు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ ప్రభుత్వ హయాంలో రేపల్లెలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్

బయోటెక్ సిటీగా.. బాపట్ల

- వనరులు సమృద్ధిగా ఉన్నాయి..
- అభివృద్ధి చేసి చూపిస్తాం
- బాపట్ల ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్



తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, మే 10: వనరులు సమృద్ధిగా ఉన్న బాపట్లను బయోటెక్ సిటీగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బాపట్ల ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. బాపట్ల పట్టణంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సైబరాబాద్ నగరం అభివృద్ధి చేసిన అనుభవాలతో అధినేత నారా చంద్రబాబునాయుడు సహకారంతో బంగారు బాపట్లగా తీర్చిదిద్ది రైతులకు, యువతకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించేందుకు పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకొస్తానని చెప్పారు. అమరావతి నుంచి పొన్నూరు, బాపట్ల, చీరాల మీదుగా ప్రపంచ గుర్తింపు లభించే విధంగా కారిడార్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 35 సంవత్సరాలు ఐపీఎస్ అధికారిగా చేసిన అనుభవంతో మాట్లాడుతున్నానని చెప్పారు. బాపట్ల గళాన్ని పార్లమెంట్‌లో వినిపించి ప్రాజెక్టులు తీసుకొచ్చేందుకు కావాల్సిన అనుభవం, సంబంధాలు తనకు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. కూటమి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు బాపట్ల పార్లమెంట్ పరిధిలో 7అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు కృష్ణప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం పూర్తిగా కొరవడిందని దీనిని గాడిలో పెట్టగలిగిన సత్తా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు మాత్రమే సాధ్యమన్నారు. నియోజకవర్గంలోని ఏప్రాంతానికి వెళ్ళిన రైతుల సమస్యలు కనిపిస్తున్నాయన్నారు. మహిళలు పడుతున్న ఇబ్బందులు తెలియజేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధి లేదని యువత ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. దీనివల్ల డ్రగ్స్, గంజాయి, నాసిరకం మద్యం బారీనపడి యువతరం పెడదోవ పడుతున్నారన్నారు. నాసిరకం మద్యం వల్ల 30లక్షల మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారని 35వేల మంది మృతి చెందారని అన్నారు. యువతరం జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుకుంటుందన్నారు. ప్రభుత్వ విధానాలతో గ్రామీణ ప్రజలు విసిగిపోయారని కృష్ణప్రసాద్ తెలిపారు. వాగ్దానాలు చేయటమే తప్ప వాటిని అమలు చేయటంలేదన్నారు.. ఒక ఛాన్స్ పేరిట అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. టీడీపీ హయాంలో ప్రజాసంక్షేమ పాలనందిస్తే వైసీపీ పాలనలో ధరలు పెంచి పేదల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. రాష్ట్రప్రజలు క్షేమంగా ఉండాలన్న యువతకు జాబ్ రావాలన్నబాబు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుకునేది తెలుసుకున్నానని వారు దౌర్జన్యాలకు దూరంగా సంక్షేమానికి దగ్గరగా ఉండాలని కూటమి వైపు చూస్తున్నట్లు తెలిపారు. టీడీపీలో క్షేమం వైసీపీలో దౌర్జన్యం ప్రజలు గుర్తించారని చెప్పారు. వైసీపీ శ్రేణులు ఓటమి భయంతో తనను నాన్‌లోకల్‌గా ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈస్ట్ గోదావరి జిల్లా రాజోలు దగ్గర తెన్నేటిపేటలో పుట్టిన తాను చదువులో, ఉద్యోగంలో ఫస్ట్ ర్యాంక్ సాధిస్తూ వచ్చానని చెప్పారు. అధికారిగా అనేక ప్రాంతాలలో పనిచేశానని అంతమాత్రన నాన్‌లోకల్ ఎలా అవుతానని ప్రశ్నించారు? ఓటు వేసి సేవ చేసే బాధ్యత కల్పించాలని నియోజకవర్గ ప్రజలను, ఓటర్లను కోరుతున్నట్లు తెలిపారు. ఇక్కడ ఓటు వేయించుకొని తాడేపల్లి వెళ్ళిపోనని, అరటితోటలు నరకటం, ఇసుకదోపిడి చేయటం వంటివి తనకు చేతకావన్నారు. ప్రజాభిమానం పొందటం వల్లే మూడుసార్లు ప్రెసిడెంట్ మెడల్ అందుకున్నట్లు కృష్ణప్రసాద్ తెలిపారు. ఎన్నికలలో ఒకసారి గెలిచిన తర్వాత తన ఇంటి తలుపులు ఎప్పుడూ తీసే ఉంచుతానన్నారు. ప్రజల పక్షాన ఉండి పనిచేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో లేకపోవటం కూడా నేరమే అవుతుందన్నారు. ఇప్పటికే అనేక రకాలుగా ప్రజలకు సేవందిస్తున్నానని అది నా స్టయిల్ అని కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. భారతదేశం ఆర్థికంగా ఒకఅప్పుడు 10వ స్థానంలో ఉండేదని ప్రస్తుతం అది 5వస్థానంలోకి వచ్చిందని త్వరలో మూడోవ స్థానంలోకి రాబోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా దేశంలో ప్రత్యేక స్థానం వస్తుందన్నారు. బ్రహ్మాండమైన సేవలందించటమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

తెలుగు ప్రజల గళం ప్రపంచ దేశాలు చూచేవిధంగా పనిచేస్తానని కృష్ణప్రసాద్ తెలిపారు. పోలవరం, అమరావతి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కుటుంబ సభ్యులమంతా కలిసి నియోజకవర్గంలో పని చేస్తున్నామని ప్రజల ఆదరణ బాగుందని ఎన్నికలలో విజయం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాలలో ప్రణాళిక బద్ధంగా పరిశ్రమలు అభివృద్ధి చేసి ప్రపంచదేశాలు చూచే విధంగా గర్వించతగ్గ స్థాయికి తీసుకెళుతానని దీనికి ప్రజలంతా మద్దతు తెలియజేయాలని కోరారు.

పేదలకు.. పట్టెడన్నం

- రూ.5కే అన్న క్యాంటిన్‌ద్వారా భోజనం, టిఫిన్ అందించిన అనగాని
- పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేదుకు ఓవర్‌హెడ్ ట్యాంక్

రేపల్లె, మే10: అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదలకు పట్టెడు అన్నం పెట్టి ఆకలి తీర్చిన ఘనత రేపల్లెలో అనగాని సత్యప్రసాద్‌ది. రేపల్లె పట్టణంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్న కూరగాయల మార్కెట్ వద్ద అన్నా క్యాంటిన్ భవనాన్ని నిర్మించారు. రూ.2లకే అల్పాహారం, రూ.5లకే భోజనం అందించి పేద ప్రజల గుండెల్లో ఎమ్మెల్యే అనగాని ప్రత్యేక గుర్తింపును పొందారు. వైసీపీ ప్రభుత్వం 2009లో అధికారంలోకి వచ్చి పేద ప్రజల కడుపు కొట్టిందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజలు ఆకలి తీర్చలేని వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో ఓటు హక్కు ద్వారా తగిన బుద్ధి చెప్పి ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి తిరిగి అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసుకునే విధంగా అండగా ఉంటామని పట్టణ వాసులు హామీనిస్తున్నారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ హయాంలో రేపల్లె పట్టణంలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి డ్రైయినేజీ, రహదారులు పాఠశాలల అదనపు తరగతి భవనాలు నిర్మించి అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించి అభివృద్ధి పథంలో నడిపారు.

పట్టణంలో ప్రతి ఇంటికి తాగునీరు సమృద్ధిగా అందించాలనే లక్ష్యంతో 6వ వార్డులోని పెదకూరగాయల మార్కెట్‌లో రూ.2.40 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే అనగాని గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. రూ.2.40కోట్లతో 8.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ ద్వారా పట్టణంలో 10వార్డులకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు దోహద పడింది. చంద్రమౌళి పార్కులో రూ.2.50కోట్ల నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి 18వార్డులకు త్రాగునీరు సమృద్ధిగా అందించేందుకు నిర్మించారు. ప్రతి ఇంటికి రూ.200కే నీటి కుళాయి కనెక్షన్ అందించి ప్రజల మన్ననలను పొందారు. ప్రస్తుత ప్రభుత్వంలో పట్టణ వాసులకు త్రాగునీరు అందించటంలో పూర్తిగా విఫలం చెందిందని ప్రజలు రోజురోజుకు ధర్నాలు నిర్వహించే పరిస్థితి నెలకొంది. పట్టణంలో డ్రైయినేజీ, రహదారులు, అంగన్‌వాడీ భవనాలు, లోఓల్టేజీ లేకుండా విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేసి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది అనగానినే అని ప్రజలు చెబుతున్నారు.



అన్న క్యాంటిన్‌లో పేదలకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనగాని



పెదకూరగాయల మార్కెట్‌లో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- నేటితో ప్రచారాలకు ముగింపు పలకాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా



అభ్యర్థులతో సమావేశమైన జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా

బాపట్ల, మే 10: పోటీలోని అభ్యర్థులు ఎలక్షన్ కమిషన్ నిబంధనలను అనుసరించి శనివారం సాయంత్రం 6 గంటల తర్వాత ప్రచారాలు చేయరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారాలు ముగిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమల్లోకి వస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. పోలింగ్‌కేంద్రాల వద్ద 100 మీటర్లలోపు మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. జిల్లాలోని 70శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున పోలింగ్‌కేంద్రాల వద్ద ఓటర్లకు తాగునీరు, షామియానాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, నోడల్ అధికారి హరికృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు రచ్చబండలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్

కూటమికి పెరిగిన ప్రజాదరణ



వేగేశన నరేంద్రవర్మకు హారతిస్తున్న మహిళ

బాపట్ల, మే 10: బాపట్ల నియోజకవర్గంలో తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమికి ప్రజాదరణ విశేషంగా పెరిగింది. విస్తృత ప్రచారంతో సూపర్‌సిక్స్ గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకుసాగుతున్నారు.. అడుగడుగున ప్రజలు నీరాజనాలు పలుకుతూ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు పూలవర్షం కురిపిస్తూ ఆయనను అనుసరిస్తూ విజయపథాన నడిపిస్తున్నారు. సేవకునిగా నరేంద్రవర్మ ప్రజలకు అందిస్తున్న సేవలు, పరిశ్రమల ద్వారా కల్పిస్తున్న ఉపాధి అవకాశాలతో పార్టీలకు అతీతంగా ప్రజానీకం పెద్దఎత్తున మద్దతు తెలియజేస్తున్నారు. నాయకునిగా నీవే మాకు కావాలంటూ ముందడుగు వేస్తున్నారు. బాపట్ల పట్టణ, మండలంతోపాటు కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో నరేంద్రవర్మ చేసే ప్రతి కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విశేష సంఖ్యలో తరలివస్తున్నారు. ఎండ తీవ్రతను కూడా పట్టించుకోకుండా నరేంద్రవర్మ విజయం కోసం పనిచేస్తామని స్పష్టమైన హామీనిస్తున్నారు. సంకీర్ణ ప్రభుత్వంలో చేపట్టే కార్యక్రమాలు గురించి తనదైనశైలిలో వివరిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. రానున్న పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని పేర్కొంటున్నారు. నరేంద్రవర్మ నాయకత్వాన్ని బలపరుస్తూ మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, సీనియర్ నాయకులు కళ్ళం హరినాథరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త గుంద్రెడ్డి శివ, జీకే నాయుడు, కర్లపాలెం జడ్పీటీసీ మెంబరు పిట్ల వేణుగోపాలరెడ్డి, మున్సిపల్ మాజీ చైనర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు తదితరులు ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్నారు. వీరంతా వైసీపీని వీడి నరేంద్రవర్మ నాయకత్వం పట్ల నమ్మకంతో టీడీపీలో చేరి ఆయన విజయం కోసం పనిచేస్తున్నారు. అదేవిధంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమైక్యంగా అడుగులు వేస్తూ ఎమ్మెల్యేగా నరేంద్రవర్మను, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌లను గెలిపించాలని వాడవాడలా, గ్రామగ్రామాన ప్రచారం చేస్తూ నమూనా ఈవీఎంను చూపిస్తూ ఓటర్లను చైతన్య పరుస్తున్నారు. రెండు దశాబ్దాల తర్వాత బాపట్లలో తెలుగుదేశం జెండా ఎగురవేసేందుకు అందరు ఒకటిగా పయనిస్తూ నరేంద్రవర్మ గెలుపుకోసం కృషిచేస్తున్నారు. వీరికి ప్రజలు హారతులు పడుతూ ఆశీర్వదిస్తూ విజయం కోసం పనిచేస్తామనే భరోసానిస్తున్నారు.



ప్రసంగిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎన్నికల ప్రచారంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు



ప్రగతి పరుగులు

- అ... అంటే అభివృద్ధి, ఆ... అంటే ఆనందబాబు
- ఇదే వేమూరు నియోజకవర్గ ప్రజల నుంచి వస్తున్న మాట
- ఆనందబాబు చేసిన అభివృద్ధిని కీర్తిస్తూ జై కొడుతున్న జనం
- రూ.300 కోట్లతో అమర్తలూరు మండలంలో అభివృద్ధి పనులు
- - సబ్ నిధులతో రూపురేఖలు మారిన ఎస్‌సీ కాలనీలు

అమృతలూరు, మే 9: అ... అంటే అభివృద్ధి ఆ.. అంటే ఆనందబాబు అంటూ ఆయన చేసిన అభివృద్ధి పనులను కీర్తిస్తూ వేమూరు నియోజకవర్గ ప్రజలు జై కొడుతున్నారు. 2009లో వేమూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆనందబాబు నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలు, వాటి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా చూశారు. ముఖ్యంగా పల్లెటూరుల్లో అప్పుడు అరకొరగా ఉన్న సీసీ రోడ్లు ఎక్కడ చూసిన మట్టి రోడ్లు వర్షా కాలంలో బురదమయంగా మారి ప్రజల అవస్థలను ఆయన కళ్లరా చూశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తూ గత ఐదేళ్లలో తాను చూసిన సమస్యలన్నింటిని నెరవేరుస్తానంటూ ప్రజలను అభ్యర్థించారు. ఆయన మాటలు విశ్వసించిన ప్రజలు 2014లో ఆయనకే పట్టం కట్టారు. విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో తాను ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు అహర్నిశలు కృషి చేసి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. నియోజకవర్గంలోని 89 గ్రామాల్లో మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లు నిర్మింపజేశారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్లు వేయించి కాలనీల రూపురేఖలు మార్చారు. 2019 ఎన్నికల్లో జగన్ గాలికి తోడు తనపై రెండుసార్లు ఓడిన నాగార్జునపై సానుభూతితో పరాజయం పాలయ్యారు. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో వేమూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గెలిచి మంత్రి అయినప్పటికీ ఒక్క అభివృద్ధి పని కూడా చేయకపోవడం, పైగా టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆనందబాబు చేసిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తుండటంతో ఈ సారి జరిగే ఎన్నికల్లో మరోసారి తప్పు చేయకుండా ఆనందబాబునే గెలిపించుకుందామనే ధృడనిశ్చయం నియోజకవర్గ ఓటర్ల నుంచి కనిపిస్తోంది.

అమృతలూరు మండలంలో 2014-19 కాలంలో 15 గ్రామాలు సుమారు రూ.90 కోట్ల నిధులతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాయి. అమృతలూరులోని రామ్మోహననగర్ కాలనీలో తాగు నీటి కోసం ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. గ్రామంలో గత 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన తూర్పు, ఉత్తర ఎస్సీ కాలనీల్లో వసతులు, అంతర్గత రహదారులు లేకపోవడంతో 5 కోట్లతో ఆయా కాలనీల్లో సిమెంట్ రోడ్లు నిర్మింపజేశారు. శిధిలావస్థకు చేరిన ప్రాథమిక వైద్యశాలకు రూ.కోటితో నూతన భవనం నిర్మించారు. మూల్పూరులో రూ.2 కోట్లతో సబ్ స్టేషన్, రూ.కోటితో సీసీ రోడ్లు, చింతాయపాలెంలో 20 సంవత్సరాల క్రితం ఇళ్ళ స్థలాలు మంజూరు చేసినప్పటికీ అక్కడ ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. విషయం తెలుసుకున్న ఆనందబాబు సబ్‌ప్లాన్ నిధులు రూ.7 కోట్లతో లేఅవుట్‌లో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేయడంతో లబ్దిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. అదే గ్రామంలో రూ.70 లక్షలతో రక్షిత మంచినీటి పథకం, రూ.7లక్షలతో కమ్యూనిటీ భవనం, రూ.5కోట్లతో కూచిపూడి-గోవాడ, కూచిపూడి-మూల్పూరు ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధి చేశారు. బోడపాడు శివారు గ్రామం కెజి పాలెం వంతెన దెబ్బతిని కూలిపోవడంతో దాని స్థానంలో రూ.2 కోట్లతో నూతన వంతెన, సీసీ రోడ్లు నిర్మించి గ్రామస్తుల కష్టాలు తీర్చారు. ప్యాపర్రులో కమ్యూని టీ భవనంతో పాటు ఎస్సీ కాలనీలో రూ.3 కోట్లతో సీపీ రోడ్లు నిర్మించారు. మోపర్రు శివారు మాతిపాలెంకు తారు రోడ్డుతోపాటు సీసీ రోడ్లు వేయించారు. తురుమెళ్ళ, పెదపూడి, యడవూరు, గ్రామాల ప్రజలు తనను ఆదరించకపోయినా వివక్ష చూపకుండా సీసీ రోడ్లు నిర్మించారు. యలవర్రులోని ఓ కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. గోవాడ, ఇంటూరు, బోడపాడు, కూచిపూడి, గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు వేయించారు ఇలా మండలాన్ని రూ.300 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పథంలో ఉంచారు. పాంచాళవరం, గోవాడ, ఇంటూరు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ భవనాలతో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు, కమ్యూనిటీ భవనాలు నిర్మించారు. రూ.80 లక్షలతో ఇంటూరులో సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన, అమృతలూరు ఎస్సీ కాలనీలో రక్షిత మంచినీటి పథకం కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరుచేయించగా 2019లో ప్రభుత్వం మారడంతో ఆనందబాబు శంకుస్థాపన చేసిన పనులను పూర్తిచేస్తే ఆయనకు పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో మంత్రి నాగార్జున ఆయా పనులను నిలిపివేశారు. మండలంలో పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి బాటపట్టించిన ఆనందబాబు మళ్లీ ఎమ్మెల్యే, మంత్రిగా వస్తేనే నియోజకవర్గంలోని అన్ని గ్రామా లలో అభివృద్ధి ముందుకు సాగుతుందని మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఆయనకే పట్టం కట్టాలని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



కెజిపాలెం వద్ద నిర్మాణం చేసిన వంతెన



చింతాయపాలెంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచి నీటి పథకం ట్యాంక్



ఇంటూరులో నిర్మాణం చేసిన సిమెంట్ రోడ్డు



నక్కా ఆనందబాబు

కలసి పనిచేద్దాం.. అభివృద్ధిని సాధిద్దాం

కారంచేడు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఏలూరి


కారంచేడులో ఎడ్ల బండిపై ప్రచారం చేస్తున్న ఏలూరి

కారంచేడు(పర్చూరు), మే 10 : కలసి కట్టుగా పనిచేసి అరాచక విధ్వంస వైసీపీని ఇంటికి సాగనంపాలని తెలుగుదేశం పార్టీ ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కారంచేడు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఏలూరికి పార్టీ శ్రేణులు, ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని మసీదులు, చర్చిల్లో ప్రార్థనలు, ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాతల్లో ఉత్సాహం నింపేవిధంగా ఎడ్లబండిపై ఏలూరి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ కృషిచేస్తుందన్నారు. 2014, 2019 జరిగిన ఎన్నికల్లో వరుసగా నన్ను ఆదరించారని కారంచేడు వాసులు తనపై చూపిన ఆదరణను ఎన్నటికీ మరువనన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు దిశనిర్దేశం అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే నవ్యాంధ్రగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకోసం ప్రజలు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏలూరి గుర్రంపై ప్రచారం అందరినీ ఆకట్టుకుంది.


ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ఆదరించండి అభివృద్ధి చేస్తా

టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా తనను ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని ఏలూరి కోరారు. కలసి కట్టుగా పనిచేసి కారంచేడు అభివృద్ధికి కృషిచేద్దామన్నారు. వైసీపీ పాలనలో రైతులు నష్టపోయారన్నారు. కనీసం తాగు నీటిని అందించలేని దుస్థితిలో పాలన సాగిందన్నారు. సాగుకు సక్రమంగా నీరందక వేల ఎకరాల్లో సాగుచేసుకున్న పంటలను రైతులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే కొమ్మమూరు కాలువను అభివృద్ధి చేసి సాగుతోపాటు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.

సాంబన్న కోసం కదిలొచ్చిన మహిళలు

నాగులపాలెం దత్తపుత్రుడు అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరి హ్యాట్రిక్ విజయం చేకూరాలంటూ నాగులపాలెం మహిళలు కదిలొచ్చారు. గ్రామం నుంచి భారీ ర్యాలీగా బయలు దేరి బొమ్మల సెంటర్ కూడలి మీదుగా కూటమి పాలన రావాలి.. చీకటి పాలన పోవాలంటూ నినాదాలు చేశారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చారు.

జగన్ పాలనకు మహిళలు చరమగీతం పాడాలి

నారీభేరి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి



నారీభేరి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, మాట్లాడుతున్న ఏలూరి

మార్టూరు : వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మహిళలు అందరూ మహాశక్తులై జగన్ ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని, రాష్ట్రం నుంచి జగన్‌ను తరిమి కొట్టాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యరి ఏలూరి సాంబశివరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో నారీ భేరీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో మహిళలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మహిళలనుద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరి మాట్లాడారు. జగన్ పరిపాలనలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని వాటిని ప్రశ్నిస్తే మహిళలపై కూడా కేసులు నమోదు చేశారన్నారు. రాష్ట్రంలో మైనింగ్, ఇసుక, మద్యం వ్యాపారాలతో రాష్ట్ర ప్రజానీకాన్ని నిలువునా దోచుకున్న జగన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని, ప్రజాభివృద్ధిని విస్మరించారన్నారు. సొంత మద్యం బ్రాండ్లతో వ్యాపారం చేసి సంపాదించిన 13వేల కోట్లతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయ వచ్చని, రాష్ట్రంలో వేలాది గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్ట వచ్చునని అన్నారు. మహిళలు విద్యావంతులు కావాలని, రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నాలన్నదే అన్న ఎన్టీఆర్ ఆశయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఆశయాలను కొనసాగిస్తూ మహిళలను ఆర్థికంగా బలవంతులను చేసి రాజకీయాల్లో చోటు కల్పించారన్నారు. ఇది అభివృద్ధికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. ప్రజలంతా విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. ఓటు ద్వారా మహిళా శక్తిని నిరూపించాలని ఏలూరి కోరారు. సమావేశంలో టీడీపీ మద్దతుదారుగా ఉన్న తమ కుటుంబాన్ని వైసీపీ వారు ఇబ్బందులకు గురి చేశారని ఇంకొల్లుకు చెందిన అంజలి ఆవేదనను వ్యక్తం చేశారు. అంతేగాకుండా ఇంకొల్లు వార్డు మెంబరు మల్లీశ్వరి, పావులూరుకు చెందిన మరో మహిళ వైసీపీ నాయకులు కక్షగట్టి, ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ఇప్పుడు మీకు టైం వచ్చిందని, ఓటుతో వారికి బుద్ధి చెప్పండని ఏలూరి సూచించారు. మహిళలం దరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడారు. నారీ భేరి కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భారీగా మహిళలు తరలి వచ్చారు. పలువురు మహిళలు వైసీపీ నాయకుల అవినీతిని, అరాచకాలను సమావేశంలో ఎండగట్టారు.

అడుసుమల్లిలో తెలుగు తమ్ముళ్ల ప్రచారం

అడుసుమల్లి (పర్చూరు), మే 10 : పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో శుక్రవారం తెలుగు తమ్ముళ్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీలతో గెలిపించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కా ర్యక్రమంలో నాయకులు నాయుడు శ్రీను, వెంకటేశ్వర్లు, సాంబయ్య, నాగేశ్వరరావు, రాంబాబు, హరిబాబు, గురుప్రసాద్, కాకుమాను, శ్రీకాంత్, వాసు పాల్గొన్నారు.

హామీలపై మడమ తిప్పిన జగన్‌రెడ్డి

- 9 సార్లు కరెంట్ చార్జీలు పెంచి వాతలు
- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి : ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, మే 10 : జగన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరిచారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ధేనువకొండ పునరావాసకాలనీ బలరామకృష్ణాపురం, వెంకటాపురం, విప్పర్లవారిపాలెంలో గొట్టిపాటి శుక్రవారం రాత్రి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ మద్యపాన నిషేధం, ప్రత్యేక హోదా, సీపీఎస్ రద్దు, కరెంట్ చార్జీల తగ్గింపు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల అమలు, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు, బీసీలకు రాజకీయపరమైన రిజర్వేషన్, జాబ్‌క్యాలెండర్ విడుదల తదితర హామీలు అమలు చేయకుండా మడమ తిప్పారన్నారు. ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపారన్నారు. నిత్యావసర ధరలు పెరుగుదల, ఆర్టీసీ చార్జీల పెంపుతో అన్ని వర్గాల ప్రజల తీరని భారం పడిందన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ముంపు గ్రామాల సమస్య లను పరిష్కరిస్తామన్నారు. ఎస్సీల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ పనిచేయడం జరుగుతుందన్నారు. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, జొన్నలగడ్డ గోపి, విజయ్, అంజయ్య, వెంకటేశ్వర్లు, తారకరామిరెడ్డి, అగస్టీన్, మహీంద్ర పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఎన్నికల ప్రచారం

అద్దంకి పట్టణంలోని 1, 2, 3 వార్డుల పరిధిలో టీడీపీ నేతలు అందరు కలిసికట్టుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాకానిపాలెంలోని మండపం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నేతలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గొట్టిపాటిని, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. టీడీపీ నేతలు కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, బోడ్డపాటి రవిబాబు, సందిరెడ్డి రమేష్, మన్నం త్రిమూర్తులు, నాదెండ్ల సుబ్బారావు, ఖగరాజం, సురేష్ పాల్గొన్నారు.

గ్రామాలలో వసతులు కల్పిస్తాం

వైదనలో ఎమ్మెల్యే గొట్టిపాటి ప్రచారం

బల్లికురవ, మే 10 : గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా టీడీపీ అధికారంలోకి రాగానే మౌలిక వసతులు కల్పిస్తామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని వైదన గ్రామంలోని చవిటి మాదిగ పల్లె, వెంకటేశ్వర కాలనీ, జెండా చెట్టు వద్ద ఎమ్మెల్యే గొట్టిపాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా దెబ్బతిన్నారన్నారు. అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారన్నారు. నవరత్నాలంటూ పేదలకు పది ఇచ్చి వారి నుంచి రూ.100 లాక్కున్నారన్నారు. కరెంట్, బస్సు చార్జీలు, పన్నులు, నిత్యావసరాల ధరలు, పెట్రోల్, గ్యాస్ ధరలు ఇలా ప్రతీదాన్నీ పెంచి పేద బతుకులతో ఆటలాడుకున్నారన్నారు. కనీసం కూలి పనులు కూడా లేక పొట్టచేతపట్టుకొని


వైదన ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్


బలరామకృష్ణాపురంలో దివ్యాంగురాలితో మాట్లాడుతున్న గొట్టిపాటి

ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలసవెళ్లిన దౌర్భాగ్యస్థితిలోకి ఆంధ్రాను నెట్టేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయంలో గ్రామాలలో పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, కాలువలు, చెత్త సంపద తయారీ కేంద్రాలు, శ్మశాన వాటికలను అభివృద్ధి చేశామన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తున్నారని గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తారని తెలిపారు. తొలి సంతకం డీఎస్సీపైనే పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ఇక రైతులు భయపడకుండా పంటలు సాగు చేసుకునేలా ప్రణాళిక రూపొందించారన్నారు. ఏడాదికి రూ.20వేల పెట్టుబడి సాయాన్ని అందజేస్తామన్నారు. పింఛన్ రూ.4వేలకు పెంపుద్వారా వృద్ధులకు ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. పథకాల్లో మహిళలు, బాలికలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, పోగుల చంద్రశేఖర్, మేడా ప్రసాద్, మూరగొండి కోటేశ్వరరావు, షేక్ గోపీ, గాలం నిమ్మయ్య, పావులూరి రామాంజి, ముత్యాల వీరాంజి, ఏలూరి శ్రీనివాసరావు, శేషారావు, బొమ్మిశెట్టి వెంకయ్య పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పంచాయతీ వార్డు మెంబర్లు

మండలంలోని వైదన గ్రామంలో పంచాయతీ వార్డు మెంబర్లు శెట్టి వెంకట నారాయణ, పసుపులేటి రామారావు శుక్రవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలానే దేవాలయ మాజీ చైర్మన్ గంప అంజయ్య, రాళ్ల రామారావు, నాగిపోగు ఇర్మియ సైకిలెక్కారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పోగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కూటమితోనే ఎస్సీ, ఎస్టీలకు మేలు : గొట్టిపాటి

పంగులూరు, మే 10 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీలకు మేలు కలుగుతుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. 13వ తేదీ సోమవారం జరిగే ఎన్నికలో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ గొట్టిపాటి ముప్పవరం ఎస్టీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఎస్టీ, ఎస్సీ ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి ఐదేళ్లుగా వారి సంక్షేమాన్ని విస్మరించారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగ్జీవన్‌జ్యోతి పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితమని చెప్పిన జగన్‌రెడ్డి దానిని అమలు చేయకుండా 9 సార్లు విద్యుత్ చార్జీలను పెంచి పేద, మధ్యతరగతి వర్గాలకు షాక్ కొట్టించారన్నారు. చంద్రబాబు పాలనలో దళితులకు ఉన్న 27 పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం పేరును జగన్ పేరుగా మార్చి, ఆ పథకాన్ని అమలు చేయలేదన్నారు. దీంతో దళిత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్నారు. జగన్‌రెడ్డి అరాచక, విధ్వంస, చేతగాని పాలనను చూసిన ప్రజలు టీడీపీ కూటమికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో కుక్కపల్లి ఏడుకొండలు, బ్ర హ్మానందస్వామి, వరపర్ల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, శ్రేణులు పాల్గొన్నారు.


అనంతవరం ఉప సర్పంచ్ షేక్ శ్రీనుకు కండువావేసి ఆహ్వానిస్తున్న ఏలూరి

అనంతవరంలో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన సర్పంచ్, ఉపసర్పంచ్.. ఇద్దరూ తల్లీకొడుకులు
- మాజీ మంత్రి బాలినేనికి శ్రీను సన్నిహితుడు

యద్దనపూడి, (మార్టూరు) మే 10: వైసీపీ పార్టీ మద్దతుదారులైన అ మ్మ సర్పంచ్... కుమారుడు ఉప సర్పంచ్ .. అయితే గ్రామంలో ఉప సర్పంచ్ షేక్ శ్రీను అ మ్మ తో కలిసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో వైసీపీ పార్టీకి కోలుకోని షాక్ తగిలింది. అనంతవరం గ్రామంలో వైసీపీ పార్టీకి బలమైన నాయకునిగా ఉన్న ప్రస్తుత ఉప సర్పంచ్, వైసీపీ మండల కన్వీనర్ షేక్ శ్రీను అమ్మ గ్రామ సర్పంచ్‌షేక్ మస్తాన్‌బీతో కలిసి అతని వర్గీయులతో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారు మండలంలోని ఇసుక దర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. వారికి కండువాలు వేసి ఏలూరి స్వాగతం పలికారు. అతనితో పాటు అతని వర్గీయులు కూడా పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఏలూరి కోరారు. అయితే ఇంకో విశేషం ఏమిటంటే పార్టీలో చేరిన షేక్ శ్రీను వైసీపీ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి అత్యంత సన్నిహితుడు. అతని చేరికతో యద్దనపూడి మండలంలో ముఖ్యంగా అనంతవరం గ్రామంలో టీడీపీకి బలం పెరిగినట్లయిందని శ్రేణులు భావిస్తున్నారు. అయితే శ్రీను టీడీపీలో చేరికపై వైసీపీ శ్రేణులు షాక్‌కు గురయ్యారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధి టీడీపీతోనే

చినగంజాం, మే 10 : ఆర్యవైశ్యులకు అండగా ఉండి, అభివృద్ధికి పాటు పడిందని టీడీపీ అని టీడీపీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు టీడీపీ కూటమి అభ్యర్థులు ఏలూరిని, కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ వాణిజ్య విభాగం నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఆర్యవైశ్య కుటుంబాల వారిని కలిసి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ, బ్యాలెట్ నమూనా చూపిస్తూ నాయకులు ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అమరా మోహనరావు, టీడీపీ వాణిజ్య విభాగం చిన గంజాం, ఇడుపులపాడు కమిటీ సభ్యులు కోట శివరామకృష్ణ, శ్రీకాంత్, వినోద్, బయ్యా సతీష్, శనగపల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తీర గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ

- ప్రత్యేక చర్యలతో అడుగులు వేస్తాం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య


పొట్టిసుబ్బయ్యపాలెంలో మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

వేటపాలెం(చీరాల), మే 10 : మండల పరిధిలోని తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని పొట్టిసుబ్బయ్య పాలెం, తానాకాలనీ, జబ్బార్‌కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం కొండయ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుడిగాలి పర్యటన చేశారు. ఆయా సందర్భాల్లో గ్రామస్థులతో మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్న తీరప్రాంత గ్రామాలను అభివృద్ధిలో అగ్రపథాన నిలుపుతామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులతో ఎల్గొన్న ఆయా గ్రామాల్లో సమస్యలను క్షుణ్ణంగా విన్నారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, కాలనీ వాసుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగాఆయా గ్రామాల ప్రజలు కలహాలు వీడి అందరూ ఏకతాటిపైకి వచ్చి గ్రామాల అభివృద్ధికి కలసి ప్రయాణం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. రాజకీయాల పేరుతో గ్రామస్థులను చీల్చి తమ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నవారి కపట నాటకాలను నమ్మవద్దన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సైకిల్‌కు ఓటేసేందుకు సైన్యంలా కదలండి

కొండయ్య కుమార్తె పిలుపు


ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య కుమార్తె శివనారాయణదేవి

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేయండి. అందుకు సైన్యంలా కదలండని టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్య కుమార్తె శివనారాయణ దేవి పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని 30వ వార్డులో శుక్రవాం రాత్రి ఆమె కూటమి శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా తన తండ్రి ఎం.ఎం కొండయ్యకు, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కూటమి మ్యానిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు ప్రత్యేక రక్షణ కల్పనకు మార్గం సుగమం అవుతుందన్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గెలిచేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, అప్పుడు అందరి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తారని ఆమె చెప్పారు. ఇంటింటికి తిరుగుతూ మ్యానిఫెస్టో, బీసీ డిక్లరేషన్, సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

మార్టూరు, మే 10: మార్టూరు గ్రామ పంచాయతీలోని 27 మంది పారిశుధ్య కార్మికులకు రోటరీ క్లబ్ వారు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్మికులకు దుస్తులను అందచేశారు. ఏటా పారిశుధ్య కార్మికులకు రోటరీ సాయమందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఫర్ట్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, అధ్యక్షుడు తాళ్లూరి సాంబశివరావు, జా ష్టి సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, షేక్ ఖాజా హుస్సేన్, మా దాల సాంబశివరావు, కొర్రపాటి వేణు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

17న బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

అద్దంకిటౌన్, మే 10 : అద్దంకి రేణంగివరం రోడ్డులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఈనెల 17వ తేదీన జరుగుతుందని కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆరాధన మహోత్సవ ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు పొన్నపల్లి బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి ఏలూరి వీరబ్రహ్మాచారి, చెన్నుపల్లి శ్రీనివాసచారి, కందెపి సుబ్బారావు, జె.శ్రీనివాసరావు, ఆంజనేయరాజు, రవికుమార్, శ్రీశైలం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో ఓటర్లకు చీరల పంపిణీ

బల్లికురవ, మే 10 : మండలంలోని ముక్తేశ్వరం పంచాయతీలో గురువారం రాత్రి అధికార వైసీపీ గ్రామ నేతలు ఇంటింటికీ తిరిగి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎన్నికల సమయం దగ్గర పడడంతో ఓటర్లను ఎలాగైనా తమ వైపునకు తిప్పుకునేందుకు వైసీపీ నేతలు ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించి గ్రామంలో చీరలు అందించడం పెద్ద చర్చనీయంశంగా మారింది. కొందరు ఓ టర్లు మాత్రం తమకు చీరలు వద్దని అంటున్నా వైసీపీ నేతలు మాత్రం గృహాల వద్దే పడవేసి వెళ్లారు. వైసీపీలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధి ఈ చీరల పంపిణీ చేసిన్నట్లు సమాచారం. గ్రామాలలో ఎన్నికల నిఘా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్లే వైసీపీ శ్రేణులు యథేచ్ఛగా ప్రలోభాలకు పాల్ప డుతున్నారని ప్రజలు అంటున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉన్నప్పటికీ, కేంద్ర బలగాలు, స్థానిక పోలీసుల నిఘా ఉందని చెప్పినప్పటికీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంలో వైసీపీ శ్రేణులు తగ్గడం లేదు. ఇదిలావుండగా కొందరు ఓటర్లు చీరలు తీసుకున్నా ఓటు మాత్రం టీడీపీకి వేస్తామని చెప్పుకుంటున్నారు. వైసీపీ నేతలు తాయిళాల జోరుపై చర్చ సాగుతోంది. చీరల పంపిణీపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వారు చెప్పారు.



సచివాలయం కోసం పరుగు..!

- ఉన్న ఊర్లో లేని కార్యాలయాలు
- ఏ అవసరానికైనా సుదూరంలో ఉన్న వేరే ఊళ్లే వెళ్లాల్సిందే
- మూడు గ్రామాల ప్రజల అవస్థలు

మార్టూరు, మే 10 : చిన్న పని కోసం సచివాలయానికి వెళ్లాలంటే పక్క ఊరికి పరుగు పెట్టాల్సిందే. దూరమైనా..భారమైనా పక్క ఊరులో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సిందే. మార్టూరు మండలంలో మూడు గ్రామాలైన దేగరమూడి, లక్కవరం, తాటి వారిపాలెం గ్రామస్థుల అవస్థలు ఇవి. వారి గ్రామాలలో నేటికీ సచివాలయాలను ఏర్పాటు చేయలేదు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో రెండు వేలు జనాభా ఉన్న గ్రామాలకు సచివాలయం ఏర్పాటు చేశారు. మేజరు పంచాయతీ గ్రామాలలో రెండు వేలు జనాభా పరిధిలో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు తర్వాత గ్రామ పంచాయతీలకు, రెవెన్యూ కార్యాలయాల వద్ద పనుల కోసం వచ్చే ప్రజలు బాగా తగ్గిపోయారు. ఏ అవసరమైనా సచివాలయాలకు వెళ్లాల్సిందే. అంతటి ప్రాధాన్యత ఏర్పాటు చేసిన సచివాలయం గ్రామంలో లేకపోవడం దానికోసం పక్క ఊరిలో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సి రావడంతో మూడు గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేగరమూడివాసులు రాజుపాలెంకు..

దేగరమూడి గ్రామస్థులు రాజుపాలెంలో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సిందే. దేగరమూడి గ్రామంలో వెయ్యి మందికి పైగా ప్రజలు ఉన్నారు. సచివాలయం ఏర్పాటు చేయలేదు. దాంతో వారందరూ రాజుపాలెం సచి వాలయాని వెళతారు. దేగరమూడి వాసులు సచివాలయం కోసం సుమారు ఐదు కిమీ దూరంలో ఉన్న రాజుపాలెం గ్రామానికి వెళ్లాల్సిందే. అయితే వారికి దూరభారం కావడమే కాకుండా ఈ రెండు గ్రామాల మధ్య 16వ నంబరు జాతీయ రహదారి అడ్డుగా ఉంది. ఈ రహదారిని దాటడానికి రహదారి నిర్మాణం జరిగే సమయంలో అండర్ పాస్ కూడా ఏర్పాటు చేయలేదు. దాంతో దేగరమూడి వాసులు రెండు కిమీ దూరంలో ఉన్న మార్టూరు గ్రామానికి వచ్చి అక్కడ పెద్ద అండరు పాస్‌ను దాటి మరలా రెండు కిమీ ప్రయాణించి రాజుపాలెం రోడ్డు వద్దకు వస్తే మరలా అక్కడ నుంచి కిలో మీటర్లకు పైగా ప్రయాణం చేస్తేనే చేరతారు. ఐదు కిలో మీటర్లు, అర్ధగంట ప్రయాణించాల్సిందే. మహిళలు, వృద్ధుల పరిస్థితి దారుణం. వారితో ఎవరో ఒకరు తోడు ఉండాల్సిందే.


రాజుపాలెం గ్రామాల మధ్య అండర్ పాస్ లేని జాతీయ రహదారి

లక్కవరం గ్రామస్థులు కోలలపూడి వెళ్లాల్సిందే

లక్కవరం పంచాయతీలోని గ్రామస్థులు సుమారు 7కిమీ పైగా ప్రయాణించి, జాతీయ రహదారిని దాటి కోలలపూడి గ్రామ సచివాలయానికి వెళ్లాలి. ఇక్కడి జనాభా వెయ్యి లోపు ఉంటారు. దీంతో ఇక్కడ సచివాలయం లేదు. వారు కోలలపూడి సచివాలయానికి రావాలంటే తప్పని సరిగా ద్విచక్రవాహనం మీదే రావాలి. ముప్పావుగంట ప్రయాణించాలి. మహిళలు, వృద్ధుల బాధలు చెప్పనలవి కాదు. తమ గ్రామానికి రవాణా పరంగా సౌకర్యంగా ఉండే 3 కి.మీ. దూరంలో ఉన్న వలపర్ల సచివాలయంలో తమకు అవకాశం కల్పించాలని గ్రామస్థులు ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా తమ గోడును పట్టించుకోలేదని గ్రామస్థులు చెప్తున్నారు.

తాటివారిపాలెం ప్రజలు బొల్లాపల్లికి వెళ్లాల్సిందే

తాటివారిపాలెం పంచాయతీ ప్రజలు బొల్లాపల్లి సచివాలయానికి పరుగు పెట్టాల్సిందే. దాదాపు 1500 మంది జనాభా ఉన్న ఈ గ్రామస్థులు అక్కడకు వెళ్లడం ఇబ్బందిగా ఉందని, ముఖ్యంగా మహిళలు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామంలోనే సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఐదు కిలోమీటర్లు ఎలా వెళ్లాలి



ఈ వయస్సులో అంతదూరం ఎలా వెళ్లగలను. నేను ఒక్కదాన్ని వెళ్లలేను. నాతో ఒకరు వెంట రావాలి. వేలి ముద్ర వేసేందుకైనా నన్ను తీసుకెళ్లాల్సిందే. నాకు బదులు ఎవరు వెళ్లినా కుదరదని చెప్తున్నారు. దీంతో వ్యయప్రయాసలు పడి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్తున్నాను. మా ఊరిలో సచివాలయం ఏర్పాటు చేస్తే మంచిది.

- ముంద్రు కోటమ్మ, వృద్ధురాలు, దేగరమూడి

ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు



ప్రతి చిన్న పనికీ పక్క గ్రామ సచివాలయానికి వెళ్లడం చాలా మందికి ఇబ్బందిగా మారింది. వృద్ధుల విషయానికొస్తే వారితోపాటు ఒకరు తోడుగా వెళ్లాల్సిందే. మా ఊరిలో ఉంటే ఎవరి సాయం లేకపోయినా వెళ్లగలం. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ సచివాలయాన్ని ఏర్పాటు చేయాలి.